J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 45 సంచిక : 51 22.5.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# సీనియర్లు సైతం జూనియర్‌కే జై

## లోకేష్ చుట్టూ టీడీపీ రాజకీయం

- అటు పార్టీలో ఇటు ప్రభుత్వంలో అన్నీ తానై వ్యవహరిస్తున్న లోకేష్
- 2027 ఉగాది నాటికి 'ముఖ్య' బాధ్యతలు స్వీకరించే అవకాశం
- యువనేత నాయకత్వానికే అన్ని వర్గాల మొగ్గు



అనూహ్యంగా 2024 ఎన్నికలలో కూటమి అఖండ విజయం సాధించిన తరువాత, యువనేత నారా లోకేష్ తెలుగుదేశం పార్టీలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారారు. ముఖ్యంగా పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో అటు పార్టీలోనూ, ఇటు పాలనలోనూ లోకేష్ ముద్ర కనిపిస్తుండడం విశేషం. ముఖ్యంగా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలు సీకరించాక ఆయన ప్రాభవం మరింతగా పెరిగింది. టీడీపీలోని అన్ని వర్గాలు లోకేష్ నాయకత్వానికే జై అంటున్నాయి. ముఖ్యంగా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్లు సైతం పార్టీలో నవశకం మొదలు కావాలని, యువతరానికి లోకేషే మార్గదర్శనం చేయాలని బలంగా కోరుకుంటున్నారు. దీంతో దాదాపుగా అధ్యక్ష విధులను కూడా అనధికారికంగా లోకేషే నిర్వర్తించే పరిస్థితి నెలకొంది. ఫలితంగా భవిష్యత్ నేత లోకేష్ అనే ప్రచారం పార్టీలో అంతకంతకూ విస్తృతమౌతోంది. అటు మంత్రివర్గంలో సైతం అన్నీ తానై వ్యవహరిస్తూ, 'ముఖ్య' బాధ్యతల స్వీకరణకు శరవేగంగా ముందడుగు వేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మొత్తం మీద టీడీపీ రాజకీయం మొత్తం లోకష్ చట్టూ తిరుగుతోందన డంలో సందేహం లేదు.

తెలుగు నేలపై ప్రచండ వేగంతో, అసామాన్య ప్రజాదరణతో అనూహ్యంగా దూసుకొచ్చిన రాజకీయ తరంగం తెలుగుదేశం పార్టీ. అప్పటి వరకు సినీరంగంలో తిరుగులేని కథనాయకుడిగా, ఆబాలగోపాలాన్ని అలరించిన నందమూరి తారక రామారావు, తెలుగోళ్ళపై ఢిల్లీ పెత్తనాన్ని ఎదిరిస్తూ, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీని నాలుగు దశాబ్దాల క్రితం స్థాపించారు. పార్టీ పెట్టిన 8 నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకుని సంచలనం సృష్టించారు. ఆ తర్వాత క్రమంగా తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తూ, ముఖ్యమంత్రి కావడంతో ఆ పార్టీకి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఎన్డీయే వంటి జాతీయ స్థాయి కూటముల ఏర్పాటులో చంద్రబాబు ముఖ్యపాత్ర పోషించి తిరుగులేని నేతగా ఎదిగారు. నాలుగు సార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తనదైన పాలన అందించి ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయి కీర్తిని గడించారు. ప్రస్తుతం 75 ఏళ్ల

2లో

# మహానాడు రద్దుతో.. డీలాపడ్డ నెల్లూరు నేతలు




ప్రపంచంలో ఎక్కడున్నా నెల్లూరోళ్ళది ఒక ప్రత్యేక శైలి. వాళ్ళు ఏ పని చేపట్టినా దానిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. నెల్లూరు బ్రాండు కనపడేలా ప్రతీ అంశంలోనూ జాగ్రత్త పడతారు. నెల్లూరు పేరు మారు మ్రోగేలా తాము చేసే పని ఘనంగా, గ్రాండ్‌గా ఉండాలని కోరుకుంటారు, ఆశపడతారు కూడా. ముఖ్యంగా ఆతిథ్యంలో నెల్లూరోళ్ళు వాళ్ళకి వాళ్ళే సాటి. అలాంటి నెల్లూరోళ్ళకి అరుదుగా దక్కిన అవకాశం నెల్లూరులో మూడు రోజులపాటు మహానాడు నిర్వహించాలన్న తెలుగుదేశం పార్టీ నిర్ణయం. పార్టీ అధిష్టానం మహానాడు నిర్ణయాన్ని ప్రకటించగానే ఎక్కడి నేతలు అక్కడ అలర్ట్ అయ్యారు.

2లో




# సీనియర్లు సైతం జూనియర్‌కే జై

(మొదటిపేజీ తరువాయి)

వయస్సులోనూ రోజుకు 18 గంటలకు పైగా విధులు నిర్వహిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో మూడో తరం ప్రవేశానికి సమయం ఆసన్నమైందనే టాక్ సర్వత్రా వినిపిస్తోంది. చంద్రబాబు తర్వాత లోకేష్ పార్టీ బాధ్యతలతో పాటు ప్రభుత్వ 'ముఖ్య' బాధ్యతలను సైతం స్వీకరిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

## తిరుగులేని ఇమేజ్...!

సీఎం చంద్రబాబు కుమారుడిగా పార్టీలో అడుగుపెట్టిన లోకేష్ తొలుత తన మాటతీరు, హావభావాలతో ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలను, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఇదే క్రమంలో తెలుగు భాషపై పట్టు లేక ప్రసంగాల్లోనూ తడబడ్డారు. ఎమ్మెల్యేగా గెలవకుండా దొడ్డిదారిన మంత్రి పదవి కొట్టేశారంటూ విమర్శలు సైతం పెద్దఎత్తున వ్యక్తమయ్యాయి. అయితే కాలక్రమంలో తెలుగు భాషపై పట్టుతో పాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో టీడీపీ కేడర్‌కు లోకేష్ దగ్గరయ్యారు. ముఖ్యంగా యువజన విభాగంలో లోకేష్ అనూహ్యమైన క్రేజ్ సంపాదించుకున్నారు. తనకంటూ నమ్మకమైన ఓ వర్గాన్ని డెవలప్ చేసుకున్నారు.

అదే సమయంలో సీనియర్లను గౌరవిస్తూ ముందుకు సాగారు. ఎప్పటికప్పుడు పార్టీ పటిష్టత కోసం ప్రణాళికలు రచించి ముందడుగు వేశారు. జిల్లాల వారీగా నాయకులతో సమన్వయం చేసుకుంటూ అందరికీ దగ్గరయ్యారు. ఎవరికి ఎప్పుడు కావాలన్నా అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పార్టీకి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో కిందిస్థాయి కేడర్‌తో కూడా లోకేష్‌కు ప్రత్యక్ష అనుబంధం ఏర్పడింది. ఏఏ ప్రాంతాల్లో ఏఏ నాయకులు ఏ స్థాయిలో పార్టీకి పనిచేస్తున్నారు. ఎవరెవరు వైఎస్సార్‌సీపీ హయాంలో కేసులను ఎదుర్కొన్నారు, అనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని కష్టపడే కార్యకర్తలను లోకేష్ ప్రోత్సహించారు. దీంతో తెలుగుదేశంలో గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర నేతల వరకు లోకేష్ వెనుక నడిచేందుకు సిద్ధమయ్యారు.

## యువగళంతో రాష్ట్రవ్యాప్తంగా..!

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరం సుదీర్ఘ పాదయాత్ర చేసి లోకేష్ పార్టీ పటిష్టత కోసం, 2024 ఎన్నికల్లో గెలుపు కోసం అలుపెరగని కృషి చేశారనడంలో సందేహం లేదు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లోకేష్ పాదయాత్రను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించడం, ఎక్కడికక్కడ పోలీసులతో అడ్డంకులు సృష్టించడం తెలిసిందే. అయితే మొక్కవోని దీక్షతో లోకేష్ యువగళాన్ని విజయవంతం చేశారు. ఇదే క్రమంలో యువగళానికి అడ్డు తగిలిన, నిబంధనలను ఉల్లంఘించి టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన పోలీసు అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుల పేర్లను రెడ్‌బుక్‌లో రాస్తున్నానంటూ ప్రకటించి సంచలనం రేపారు. ఇక కూటమి ప్రభుత్వం బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వంలో అన్నీ తానై లోకేష్ నడిపిస్తున్నారనే పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు రావడం, అమరావతి నిర్మాణంలోనూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఇక మంగళగిరిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాదర్బార్ పేరుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రిగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ప్రశంసలందుకున్నారు. తాజాగా తిరుపతి జిల్లాలోని సత్యవేడు రీజియన్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ద్వారా పెట్టుబడులు పెట్టించి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు, కీర్తిని సంపాదించారు. ఫలితంగా యువతలో తనపై సానుకూల దృక్పథం కలిగేలా లోకేష్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## సీనియర్లూ అదే బాటలో..!

ఇక తాజాగా నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిల కుటుంబాలను కలిసి ఆత్మీయ విందులను లోకేష్ ఏర్పాటు చేయడం ఆయన విలక్షణ రాజకీయ శైలికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఫలితంగా పార్టీలోని సీనియర్ నాయకుల్లో సైతం లోకేష్‌పై సానుకూల దృక్పథం ఏర్పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. తొలుత లోకేష్ పార్టీలో యువ నాయకులను ప్రోత్సహిస్తూ, తమను నిర్లక్ష్యం చేస్తున్నారని, చిన్నచూపు చూస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయపడేవారు. పార్టీ అంతర్గత సమావేశాల్లోనూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం లోకేష్‌ను మోడీ వంటి నేతలే తరచూ తనవద్దకు పిలిపించుకుని పనితీరు ప్రశంసిస్తుండడంతో సీనియర్ నాయకులు సైతం తాము కూడా లోకేష్‌కు జై కొట్టేందుకు ప్రస్తుతం పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఫలితంగా అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ లోకేష్‌కు ఎదురులేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

## 2027 ఉగాది తర్వాత..!

ఇక దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని భావిస్తున్న చంద్రబాబు, తన తర్వాత పార్టీ పగ్గాలను కుమారుడికి అప్పగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి బాధ్యతలను సైతం అప్పగించి సలహాదారుడి రూపంలో మార్గదర్శకం వహించాలని చంద్రబాబు తలపోస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈమేరకు 2029 నాటికి లోకేష్‌కు ప్రభుత్వాన్ని నడిపేందుకు అవసరమైన అనుభవం సమకూరుతుందని ఆయన అంచనా వేస్తున్నట్లు తెలిసింది. ఈమేరకు అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2027 ఉగాది తర్వాత లోకేష్ సీఎం కావడం తథ్యంగా కనిపిస్తోంది. ఈమేరకు అటు బీజేపీ పెద్దలు, ఇటు జనసేన అధినేత కూడా ఈ విషయంలో సానుకూలంగానే ఉన్నట్లు సమాచారం.

ఏదేమైనా ప్రస్తుతం తెలుగుదేశం రాజకీయం మొత్తం లోకేష్ కేంద్రంగానే జరుగుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో ఆయన ఎంత వరకు అంచనాలను అందుకోగలరో..? ఏమేరకు కేడర్‌ను, కార్యకర్తలను ఏకతాటిపై నడిపించగలరో..? అత్యంత ఆసక్తిని రేపుతోంది. మూడోతరం నాయకత్వంలో ముందుకు సాగనున్న తెలుగుదేశం భవిష్యత్, లోకేష్ కేంద్రంగా రూపుదిద్దుకోనుండడం, ఆయన ఎన్డీయే కూటమి భవిష్యత్ నేతల్లోనూ ఒకరుగా గుర్తింపు పొందడం మాత్రం ఆంధ్రరాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలకనుందనడంలో సందేహం లేదు. లోకేష్ ముఖ్యమంత్రి అయితే, ఆయనకు తగినట్లు యువరక్తంతో కేబినెట్‌ను రూపొందించి, సీనియర్లకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం కూడా తాజాగా తెలుగుదేశం పార్టీలో జోరందుకోవడం విశేషం..!

# డీలాపడ్డ నెల్లూరు నేతలు

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికి తగ్గ స్థాయిలో మహానాడు నిర్వహణలో తామూ భాగం పంచుకోవాలని ఉవ్విళ్ళూరారు. మహానాడు నిర్వహణ నెల్లూరు నగరంలోనా, రూరల్‌లోనా, సర్వేపల్లి నియోజకవర్గంలోనా లేక కోవూరు నియోజకవర్గంలోనా అన్న మీమాంస కొనసాగింది. చివరికి కోవూరు నియోజకవర్గంలోని ఇఫ్కో ఎస్.ఈ. జడ్ స్థలంలో నిర్వహించాలని నిర్ణయించారు. బాధ్యత వేమిరెడ్డి దంపతులపైన పడింది. స్వతహాగా తాను ఏం చేసినా తనదైన ముద్ర వుండేలా కార్యక్రమాన్ని నిర్వహించడం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నైజం. అందుకోసం ఆయన ఎక్కడా రాజీపడరు, ఖర్చుకి వెనకాడరు. చేయి చాచి ఎవ్వరినీ ఒక్క రూపాయి అడగరు. తన చెయ్యి ఎప్పుడూ పైనే వుండాలని కోరుకునే వ్యక్తిత్వం ఆయనది. చేసే పనిలో నాణ్యత, శుభ్రతతో పాటు ప్రత్యేకత వుండాలని ఆశించే మనస్తత్వం ఆయనది. అదే తరహాలో మహానాడు నిర్వహణ బాధ్యతని తన భుజస్కందాలపై ఎత్తుకున్నారు. దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి 1992లో తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ నిర్వహించిన తరహాలో నెల్లూరు మహానాడు సభలని వీపీఆర్ నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాన్ని ఆయన ఛాలెంజ్‌గా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారని పార్టీ శ్రేణులు, వేమిరెడ్డి అభిమానులు ఆశపడ్డారు.

ఇదే తరుణంలో జిల్లాలోని నేతలందరూ ఎవరికి తోచిన స్థాయిలో వాళ్ళు మహానాడు నిర్వహణలో భాగస్వాములు కావడానికి ఆసక్తి చూపించారు. రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు తమదైన తరహాలో స్పందించారు. నాయుడుపేట నుండి కావలి వరకూ హోటళ్ళు, సర్వీస్ అపార్టుమెంట్లు, గెస్టుహౌసులలో అందుబాటులో వున్న రూములన్నీ బుక్‌చేసి అడ్వాన్సులు కట్టారు. అలాగే వాహనాలని సైతం బుక్ చేశారు. అటు నగరం ఇటు రూరల్‌తో పాటు మహానాడు నిర్వహణా వేదిక వరకూ అన్ని ప్రధాన కూడళ్ళలోని ప్రచార బోర్డులని బ్లాక్ చేశారు. భారీ స్థాయిలో ప్రచార సామాగ్రిని సిద్ధం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపులో భాగంగా మహానాడు రద్దు చేస్తున్నట్లు గత శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో, ఒక్కసారిగా జిల్లా నేతలు డీలాపడ్డారు. తమ ప్రతిభ చూపించి నెల్లూరోళ్ళ సత్తా చూపించాలని ఆశపడ్డ మన నాయకుల ఆశలు అడియాశలయ్యాయి. పరిస్థితులన్నీ చక్కబడి వచ్చే ఏడాదన్నా మహానాడు నెల్లూరులో జరిగి తమ సామర్థ్యం, సమర్థత చూపించే అవకాశం తమకి రావాలని జిల్లా నేతలు కోరుకోవడం కొసమెరుపు..!

# ప్రజలపై భారం మోపడం సరికాదు

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి




వైసీపీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీజిల్ పెట్రోల్ రేట్లు తగ్గిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి, ఇప్పుడు మళ్లీ రేట్లు పెంచి ప్రజలపై భార మోపడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదలపై డక్కిలి మండలంలో వైసీపీ తరపున నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్ఆర్‌సిపి నేతలు, కార్యకర్తల, జనసందోహాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజా వ్యతిరేక చర్యని ఆరోపించారు. దీంతో రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరగడంతో పాటు ఆటో క్యాబ్ లారీ డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటుందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ఆయన సూచించారు.

# ఎన్‌సిసిలో రాణిస్తున్న ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆర్మీ విభాగానికి చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు ఈనెల 5 నుంచి 14 వరకు వీవీఐటి యూనివర్సిటీ (గుంటూరు) మరియు నెల్లూరులోని అక్షర విద్యాలయంలో జరిగిన ఎన్‌సిసి శిబిరాలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ పోటీలలో బహుమతులు గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసులు, ఎన్‌సిసి అధికారి గోవిందు మాధవయ్య తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సిసిలో కూడా ప్రతిభ కనబరుస్తూ ఉండడం హర్షదాయకమన్నారు. ఈ శిబిరాల్లో విద్యార్థులు భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. తమ కళాశాలలో ఆర్మీ మరియు నేవీ విభాగాలు చాలా సమర్థవంతంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని, కొత్తగా ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు ఇలాంటి సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరాలలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వ్యాసరచన పోటీలు, ఆటలు, టెంట్ పిచ్చింగ్, ఫైరింగ్, వ్యక్తిత్వ వికాసం, వంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీసిటీలో..చిన్మయ అమృత మహోత్సవ్ వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీలతో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

చిన్మయ మిషన్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'చిన్మయ అమృత మహోత్సవ్' వేడుకలలో భాగంగా శ్రీసిటీలో ఇటీవల పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నై అండ్ నార్త్ ఈస్ట్ చిన్మయ మిషన్ రెసిడెంట్ ఆచార్యులు స్వామి మిత్రానంద ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వామీజీకి సాదర స్వాగతం పలికారు. మిత్రానందతో పాటు కొయంబత్తూరులోని చిన్మయ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ రెసిడెంట్ డైరెక్టర్ స్వామి అనుకూలానంద, కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద, గుంటూరు మరియు విశాఖపట్నం చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామి సువీరానంద తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, చిన్మయ మిషన్ సభ్యులు సమక్షంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో "బ్యాటిల్‌ఫీల్డ్ టు బోర్డ్ రూమ్" అంశంపై హెచ్.హెచ్. స్వామి మిత్రానంద సరస్వతి ప్రేరణాత్మక ఉపన్యాసం చేశారు. డా. రవీంద్ర సన్నారెడ్డి తన స్వాగత ప్రసంగంలో దేశ నిర్మాణం, విలువల ఆధారిత విద్య, యువత సాధికారతకు చిన్మయ మిషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# 'స్వచ్ఛ భారత్' అమలులో ఆంధ్రకు ప్రత్యేక గుర్తింపు

**• ఢిల్లీ జాతీయ సదస్సులో మంత్రి నారాయణ**

'స్వచ్ఛ భారత్' అమలులో ఆంధ్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది. స్వచ్ఛభారత్ 2.0 కార్యక్రమాల అమలు, పట్టణ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో రాష్ట్రాలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై న్యూ ఢిల్లీలో ఈనెల 20న నిర్వహించిన జాతీయ స్థాయిలో నిర్వహించిన సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఈ సదస్సుకు హాజరై, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కీలక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులకు వివరించారు. ఈ సదస్సులో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, వివిధ రాష్ట్రాల మున్సిపల్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు, పట్టణాభివృద్ధి నిపుణులు, ఆంధ్రప్రదేశ్ తరఫున పురపాలక శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ 2.0 కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ కార్యక్రమాలుగా కాకుండా ప్రజా ఉద్యమాలుగా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఘన మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న సమగ్ర విధానాన్ని మంత్రి వివరించారు. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డ్ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

## కేంద్రమంత్రితో మంత్రి నారాయణ భేటీ

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఈనెల 20న ఢిల్లీలో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. విశాఖ మెట్రో రైలు మార్గంలో 13 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ లైన్ ఏర్పాటు చేసేలా రైట్స్ సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనుమతులు జారీ చేసి, త్వరగా ప్రాజెక్టులు ప్రారంభం అయ్యేలా చూడాలని కేంద్రమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.



## తమిళనాడు సీఎం విజయ్‌ని కలసి

# అభినందించిన మన మాగుంట

తమిళనాడులో సంచలనాత్మక విజయం సాధించి అనూహ్యంగా సీఎం పీఠాన్ని అధిరోహించిన సినీ హీరో, టీవీకే పార్టీ అధినేత జోసెఫ్ విజయ్‌ని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మన మాగుంట శ్రీనివాసులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన మేనల్లుడు సిద్ధవరపు రామిరెడ్డితో కలసి వెళ్ళిన శీనయ్య విజయ్‌ని శాలువాతో సత్కరించి అభినందించారు.

## ప్రజల నుంచి వచ్చే అర్జీలను..

# ఏరోజుకారోజే పరిష్కరించాలి

**• జిల్లా కలెక్టర్ హిమాన్షు ఆదేశం**



గోనుపల్లిలో ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

గురువారం రాపూరు మండలం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చిన ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఏరోజు కారోజే వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 21వ తేదీ గురువారం పల్లెవీక్షణం కార్యక్రమంలో భాగంగా రాపూరు మండలం గోనుపల్లిలో జరిగిన ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం, గోనుపల్లిలోని అంగన్వాడీ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులతో ముచ్చటించి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. రైతు భరోసా కేంద్రంలో ఛాంపియన్ రైతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోనుపల్లి గ్రామాన్ని సిసి రోడ్లతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 7 చెరువులను కోటి రూపాయలతో జలజీవన్ మిషన్ కింద అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. ఘన వ్యర్థాల నుండి సంపద తయారీ కేంద్రం పనితీరు బాగుందన్నారు. ఐసిడిఎస్ అంగన్వాడీ ప్రైమరీ స్కూలు బాగా పనిచేస్తున్నదని ఆయన కొనియాడారు. వెంకటగిరి శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, గోనుపల్లె అభివృద్ధికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం, డీఆర్డీఏ తరఫున 49 మందికి 7 లక్షల 39 వేల రూపాయలు విలువచేసే సెల్‌ఫోన్‌లను కలెక్టర్, ఎమ్మెల్యే కలసి సిబ్బందికి అందజేశారు.

# ఆత్మకూరు అభివృద్ధికి.. మాస్టర్‌ప్లాన్

**• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



ఆత్మకూరు పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 20వ తేదీ నెల్లూరులోని తమ క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌పై నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలపై మంత్రి చర్చించారు. ఆత్మకూరు పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. పట్టణంలో రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్ల కనెక్టివిటీ మెరుగుదల, సీసీ రోడ్ల నిర్మాణం, ఆధునిక డ్రైనేజ్ వ్యవస్థ, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించామన్నారు.

## పెట్రోల్, డీజల్ ధరల పెంపుపై..

# పర్వతరెడ్డి మండిపాటు



పెట్రోల్ డీజల్ ధరల పెంపుపై నిరసన వ్యక్తం చేస్తూ, ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. అందులో భాగంగా, నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత, నెల్లూరు బార్సాస్ సెంటర్ నుంచి.. కలెక్టరేట్ వరకు ప్రజలు, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే.. వ్యాట్‌ను తగ్గించి.. పెట్రోల్–డీజిల్ ధరలు సామాన్య ప్రజలకు భారం కాకుండా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకపక్క ఇంధన పొదుపు అంటూనే.. పెట్రోల్ డీజిల్ ధరలను అమాంతంగా పెంచేసి.. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని వారు దుయ్యబట్టారు.

## 'చింతలదేవి'కి నూతన జేడీ

కొండాపురం మండలంలోని చింతల దేవి నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్ (ఎన్‌కేబీసీ)కి జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ బి.రామమోహన్‌రావును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. అనకాపల్లి పశుసంవర్ధక శాఖలో డీపీహెచ్‌ఓగా ఉన్న ఆయన్ను ఇక్కడ నియమించారు.

## రాజకీయ చైతన్యానికి..

# మారుపేరు..సౌత్ మోపూరు

**• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



కర్మక్రతువుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరురూరల్ మండలంలోని సౌత్ మోపూరు గ్రామం రాజకీయ చైతన్యానికి మారుపేరని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. సౌత్‌మోపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కర్మ క్రతువుల భవనాన్ని ఈనెల 21న ఆయన జెడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఆ తర్వాత ప్రజలకు సంబంధించిన అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇవ్వాలన్నది తన అభిమతమన్నారు. గత పన్నెండేళ్ళుగా తాను ఎమ్మెల్యేగా ఉన్నా ఎక్కడా తగాదాలను ప్రోత్సహించలేదన్నారు. సౌత్‌మోపూరు గ్రామ ప్రజలు తగాదాలకు పోకుండా అందరూ కలసిమెలసి ఒక కుటుంబ వాతావరణంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సౌత్‌మోపూరులో కర్మక్రతువుల భవనాన్ని నిర్మించామని, ఇంకా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని ఆనం అరుణమ్మ చెప్పారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాయర్
మే 22, 2026

# ప్రపంచాన్ని భయపెడుతున్న 'సూపర్ ఎల్‌నినో'

'సూపర్ ఎల్‌నినో'.. ఈ మాటే ఇప్పుడు ప్రపంచాన్ని భయపెడుతోంది. వాతావరణ మార్పులతో లేనిపోని విపత్తులు వచ్చి అనేకదేశాలు నానా యాతనలు పడాల్సి వస్తుందని, మానవాళికి ఇదో పెనుముప్పుగా తయారయ్యే పరిస్థితి కనిపిస్తోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, ఇటీవలి దాకా ఉన్న ఎల్‌నినో కాస్తా సూపర్ ఎల్‌నినోగా మారి భూమండలానికి అనేక ఉపద్రవాలను తెస్తుందనే భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అసలు 'ఎల్‌నినో' అంటే ఏమిటి?..అంటే, వాతావరణానికి సంబంధించి జరిగే ప్రక్రియల్లో ఒక పెద్ద మార్పు అన్నమాట. ఈ ఎల్‌నినో కారణంగా, ఇండోనేషియా-ఆస్ట్రేలియా దేశాల దగ్గర పసిఫిక్ మహాసముద్రంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు చల్లగాను, దక్షిణ అమెరికా-ఉత్తర అమెరికాల వద్దనున్న సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యంత వేడిగాను మార్పు చెందుతాయి. ఈ ప్రత్యేక వాతావరణ పరిస్థితినే 'ఎల్‌నినో స్థితి' అని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. దీని ప్రభావంతో వేసవి మరింత వేడిగా భగ్గుమంటుంది. చలికాలంలో కూడా వేసవిలా మండిపోతుంటుంది. రుతువులు ఇలా తమ సహజస్థితిని కోల్పోయే దుస్థితే ఇది. ఈ ఎల్‌నినోయే మరింత తీవ్రమై సూపర్ ఎల్‌నినోగా మారుతుంది. ఇదింకా భయంకరమైనది. పసిఫిక్ సముద్రజలాలు బాగా వేడెక్కిపోయి రానున్న పక్షం రోజుల్లోపలే సూపర్ ఎల్‌నినోగా మారి, పలు దేశాలని అల్లకల్లోలం చేయనున్నాయనే సమాచారం సామాన్య ప్రజానీకాన్ని సైతం బెంబేలెత్తిస్తోంది.

ప్రపంచ ఉష్ణోగ్రత సాధారణ స్థాయికంటే మరో రెండు డిగ్రీలు పెరిగితే అది సూపర్ ఎల్‌నినో అంటారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో సూపర్ ఎల్‌నినో వల్ల కలిగే విపత్తుల విషయమై పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది కూడా. దీనివల్ల మనదేశంలో రానున్న రోజుల్లో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఏర్పడి, కొన్ని రాష్ట్రాల్లో కరువు, మరికొన్ని చోట్ల అత్యధిక వర్షాలతో భీభత్సంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. సూపర్ ఎల్‌నినో వల్ల మన దేశంలోనూ రుతుపవనాలు దెబ్బతిని, కొన్నిచోట్ల సాధారణ వర్షపాతం కంటే తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా నమోదు కావచ్చంటున్నారు. ఉత్తర అమెరికా, యూరప్ దేశాల్లో తుఫానులు, వడగాడ్పులు సంభవించవచ్చని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా, మనదేశంలో కూడా అతివృష్టి-అనావృష్టి వంటి విపత్తులతో సతమతమయ్యే పరిస్థితి వచ్చే ప్రమాదం లేకపోలేదని కూడా శాస్త్రవేత్తలు అంటున్నారు. తమిళనాడులో అతివృష్టి, చెన్నైలో వరదలు తప్పేలా లేవని కూడా ఊహిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఎండలు మరింత భగ్గుమంటాయని అంటున్నారు. ఆ సూచనలు ఇప్పటికే కనిపిస్తున్నాయి కూడా. ఈ వేసవిలో మేనెల నుంచి ఎండలు గతంలో ఎన్నడూ లేని విధంగా మరింత తీవ్రమయ్యాయి. ప్రత్యేకించి చల్లని సముద్రతీరం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటేశాయి. మే 19వ తేదీ నాటికే పల్నాడు జిల్లా పిడుగురాళ్ళలో 45.6 డిగ్రీలు, నెల్లూరుజిల్లా గూడూరులో 44.9, కృష్ణాజిల్లా కంకిపాడులో 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు చెప్తున్నారు. ఆంధ్రలో గతంలో 35 డిగ్రీల ఎండ దాటితేనో 'అబ్బో ఇవి ఎండలా, మంటలా?.. అని ఆందోళన చెందేవారు. ఇప్పుడు రాష్ట్రంలోని 23 జిల్లాల్లోనూ 41 డిగ్రీలకు పైగానే ఎండవేడిమి రికార్డు కావడంతో జనం నిప్పుల కొలిమిలో కాగుతున్నట్లవుతోంది. రాష్ట్రం అగ్నిగుండంలా భగభగమంటోంది. ఉదయం 7 గంటలకే ఎండ చుర్రుమంటోంది. 10 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఎండ భగ్గుమంటుండడంతో రోడ్లపైకి రావడానికే జనం భయపడుతున్నారు. అనేక ప్రాంతాల్లో వడగాడ్పులు కూడా అధికమయ్యాయి. ఈ ఎండలు 47 డిగ్రీలకు కూడా చేరే అవకాశం ఉందంటున్నారు. మే 21 గురువారం నాటికి ఎండలు పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల్లో 50 డిగ్రీల వరకు కూడా నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారంటే, భూతాపం ఎంత భారీగా పెరిగిపోతుందో ఊహించుకోవచ్చు. మే 26వ తేదీ వరకు ఎండలు మంటల్లాగా ఉంటాయని, కనుక అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని వారు సూచిస్తున్నారు. ఏదేమైనా, ఏడాదికేడాది మారిపోతున్న ఈ వాతావరణ మార్పులను గమనిస్తూ, రానున్న విపత్తుల నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సి ఉంది. ప్రభుత్వాలు ఆ మేరకు ప్రజలని రక్షించేందుకు అన్ని విధాలుగా సమాయత్తం కావాల్సి ఉంది.

# ఆందోళన కలిగిస్తున్న ఆర్థిక సంక్షోభం!

తాజాగా మనదేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం ఆందోళన కలిగిస్తోంది. నేను ఒక సామాన్య మధ్యతరగతి మహిళని. చిన్న ప్రయివేట్ సంస్థలో ఉద్యోగస్తురాలిని. గత నెల నా కూతురి కాలేజీ ఫీజు కట్టడానికి, నెల సరుకులు కొనడానికి రెండుసార్లు ఆలోచించాల్సి వచ్చింది. ఒకప్పుడు 1000 రూపాయలకి వచ్చే సరుకులు ఇప్పుడు 1600 దాటుతున్నాయి. నా జీతం మాత్రం అదే. పెట్రోల్ కొట్టించాలంటే భయం, ఆటో ఎక్కాలంటే భయం. ఇది నా ఒక్కదాని కథ కాదు. నా పక్కింటి ఆటో డ్రైవర్ నుండి, మా వీధిలో కూరగాయలు అమ్మే ఆమె వరకూ అందరిదీ ఇదే బాధ. ఈ సంక్షోభం గణాంకాల్లో కాదు, మన వంటిళ్లలో కనిపిస్తోంది. చిన్న వ్యాపారాలు మూతపడుతున్నాయి. యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. ఈ సమయంలో మా నాన్నగారు చెప్పిన మాటే నాకు గుర్తుకొస్తోంది "కష్టం వచ్చినప్పుడు మనసు జారిపోతే, ఒడ్డున పడటం కష్టం". ఇప్పుడు కావలసింది ధైర్యం. మన ఖర్చులు మన చేతిలో ఉన్నాయి. అనవసర ఆర్భాటాలు తగ్గిద్దాం. స్థానికంగా దొరికే వాటిని కొందాం. ఒకరి కష్టానికి ఒకరం తోడుగా నిలబడదాం. పాలకులు, ప్రభుత్వాలు కూడా కేవలం హామీలకే పరిమితం కాకుండా, కార్యాచరణలో తమ సత్తా చూపాలి. ధరల నియంత్రణ, నిజమైన ఉపాధి కల్పన, చిన్న వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు ఇలాంటి వాటిపై వెంటనే దృష్టి పెట్టాలి..!

– డి.హరిత, గూడూరు.




# బాధ్యతాయుత నిర్ణయం నెల్లూరు మహానాడు రద్దు!

ఒక ప్రజానాయకుడి సమర్థతకి, సమయస్ఫూర్తికి నిదర్శనం నెల్లూరు మహానాడు రద్దు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం, ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నెల్లూరులో జరగాల్సిన మహానాడును రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం అభినందనీయం. తెలుగుదేశం పార్టీకి మహానాడు అంటే పండుగ లాంటిది. లక్షలమంది కార్యకర్తలు, భారీ ఏర్పాట్లు, కోట్ల రూపాయల ఖర్చు. అయినాసరే, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆడంబరాలు వద్దని, ఆ ఖర్చును పార్టీ కార్యకర్తల సంక్షేమానికి, బాధితుల సహాయానికి వాడాలని ప్రకటించి, మహానాడుని కేవలం జూమ్ మీటింగులకే పరిమితం చేద్దామన్న చంద్రబాబు నిర్ణయం ఆయనలోని నాయకత్వపు లక్షణాలకి మరోసారి అద్దం పట్టింది. యుద్ధాల కారణంగా దేశం ఆర్థిక సంక్షోభం వైపు అడుగులేస్తోంది. ఇలాంటి సమయంలో నాయకులు వేదికలెక్కి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే, ప్రజల కష్టాన్ని అర్థం చేసుకొని ఆచరణలో తోడుగా నిలబడటం ముఖ్యం. చంద్రబాబు అదే చేశారు. "ఖర్చులు తగ్గించుకోండి" అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఒక్క పిలుపుని అందిపుచ్చుకుని "ప్రజల కన్నీళ్లు తుడవలేని పండుగలు మాకొద్దు" అనే సందేశాన్ని మహానాడు రద్దు నిర్ణయం ద్వారా చంద్రబాబు ఇచ్చారు. ఇది కేవలం ఒక సభ రద్దు కాదు, ప్రతిభ వున్న నాయకుడి విలువలకు నిదర్శనం. ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి నాయకుడు ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఈ సమయంలో, ఖర్చు తగ్గించుకొని ఆ డబ్బును పేదలకు ఉపయోగించాలన్న చంద్రబాబు ఆలోచనను మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నాను. ఇదే నిజమైన ప్రజా సేవ.

– వీ.సీ.చౌదరి
మాగుంట లే అవుట్, నెల్లూరు.

# పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు!

మనసులో మాట 98

**పుత్రపౌత్రాభివృద్ధిశ్చ, ధనధాన్యసమృద్ధిమాన్।**
**ఆయురారోగ్య సౌభాగ్యం, వర్ధతాం సదా సర్వదా॥**

"సంతానం, పౌత్రులతో వంశం వృద్ధి చెందాలి. ధనధాన్యాలతో, ఆయురారోగ్యాలతో మీ వంశం నిరంతరం వర్ధిల్లాలి." అని ఈ ఆశీర్వచనం అర్థం. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఈ ఆశీర్వాదం బలంగా వ్యాపించాల్సిన అవసరం కనబడుతోందని ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు భావిస్తున్నట్లుంది. రాష్ట్రంలో జనన రేటు పడిపోవడంపై ఆయన ఇటీవలకాలంలో తరచూ ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా జననాల సంఖ్య పెంచడానికి ప్రోత్సాహకాలు కూడా ప్రకటిస్తున్నారు. భారతదేశం ఒకప్పుడు "జనాభా విస్ఫోటనం" గురించి ఆందోళన చెందింది. అందుకోసమే జనాభా తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని భావించి నాటి పాలకులు, విధాన నిర్ణేతలు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించారు. అయితే, ఇందులో కూడా అసమానత ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబనియంత్రణను బాగా పాటించగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్దగా పాటించలేదు. ఫలితంగా నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జననాల రేటు ఆందోళన కలిగించేదిగా ఉంది. 'టోటల్ ఫెర్టిలిటీ రేటు'.. అంటే ఒక మహిళ తన జీవితకాలంలో సగటున కనే పిల్లల సంఖ్య స్థిరీకరణ స్థాయి అయిన 2.1కంటే చాలాతక్కువకు పడిపోయింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నివేదికల ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లో జననాల రేటు ప్రస్తుతం 1.5కి పడిపోయింది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, 2050 నాటికి భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన వారి జనాభా 20% దాటనుంది. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 23% నుండి 25% జనాభా వృద్ధులుగా ఉండే అవకాశం ఉందని అంచనా. అంటే, పనిచేసే యువత సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. ఇది మంచి పరిణామం కాదు. ఆర్థిక వ్యవస్థపై వృద్ధుల సంరక్షణ భారం కూడా విపరీతంగా పెరగనుంది. జననాల రేటు తగ్గడానికి కుటుంబ నియంత్రణ విధానాలు ప్రధాన కారణమయితే ఇప్పుడు జననాలు రేటు పెరగకపోవడానికి ఉన్న పలు కారణాల్లో నేటి తరం ఆలోచన తీరులో వస్తున్న మార్పు ఒకటి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో పిల్లల పెంపకం అనేది ఉమ్మడి బాధ్యతగా ఉండేది. పిల్లలను చూసుకోవడానికి ఇంట్లో పెద్దలు ఉండేవారు. కానీ, నేటి పట్టణీకరణ, న్యూక్లియర్ కుటుంబాలు, ఉద్యోగ పోటీ ప్రపంచంలో పిల్లల పెంపకాన్ని ఒక 'ఖర్చు'గా, భారంగా చూసే పరిస్థితి ఏర్పడింది.. ఆర్థిక భారానికి తోడు, కెరీర్ ఎదుగుదల మందగిస్తుందనే ఆందోళన మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలను పిల్లల పెంపకంపట్ల విముఖత చూపేలా చేస్తోంది. అందుకే పిల్లలు వద్దు అనుకునే తరం ఒకటి క్రమంగా తయారవుతోంది. జీవితంలో స్థిరపడిన తర్వాతే పెళ్లి అని నిశ్చయించుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. అందుకే లేటు వయసులో పెళ్లిళ్లు అవుతున్నాయి. జననాల రేటుపై ఇది కూడా ప్రభావం చూపుతోంది. జీవనశైలి మారడం వల్ల తలెత్తున్న ఆరోగ్య సమస్యల కారణంగా కూడా దంపతుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతోంది. ఈ పరిణామాలన్నీ జననాల రేటు మందగించడానికి కారణాలే.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అత్యంత కీలకం. మూడు,నాలుగో సంతానానికి ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించడం ద్వారా, ప్రభుత్వం ఒక సంకేతాన్ని పంపుతోంది – అదేమిటంటే, సంతానం అనేది భారం కాదు, అది దేశానికి ఇచ్చే ఆస్తి. అయితే, కేవలం నగదు ప్రోత్సాహకాలతోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని భావించకూడదు. ఇది ఒక మానసిక, సామాజిక మార్పునకు సంబంధించిన అంశం. తెలుగు రాష్ట్రాల్లో మనం ఒక 'ఫ్యామిలీ ఫ్రెండ్లీ' వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఏ రకమైన ప్రోత్సాహకాలు ఇచ్చినా, కార్పొరేట్ సంస్థలు, సమాజం కూడా ఇందులో భాగస్వాములు కావాలి. ఉద్యోగాల్లో ఉండే మహిళలకు పని వాతావరణంలో మరిన్ని సదుపాయాలు, పిల్లల పెంపకంలో తండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం, నాణ్యమైన చైల్డ్ కేర్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం వంటివి ఎంతో ముఖ్యం.

ఈ విధానాలు కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో ఒక చర్చగామారాలి. జనాభా స్థిరీకరణను దాటి, జనాభా క్షీణతవైపు వెళ్తున్నప్పుడు, విధాన నిర్ణేతలు 'ప్రో–నేటలిస్ట్' విధానాల వైపు మొగ్గుచూపడం అనివార్యం. చంద్రబాబు ఇప్పుడు అదే పని చేస్తున్నారు. ఆనాటి జనాభా నియంత్రణ ఉద్యమం నుంచి నేటి జనాభా సంరక్షణ వరకు తన దృక్పథాన్ని మార్చుకోవడం ద్వారా పరిణితి చెందిన నాయకత్వం ఎలా ఉంటుందో చూపిస్తున్నారు. యువత పిల్లలను పెంచే ప్రక్రియను ఒక ఆనందకరమైన ప్రయాణంగా భావించేలా, ప్రభుత్వం భరోసా ఇవ్వాలి.

ఐరోపా ఇప్పుడు "వృద్ధాప్య సమాజం" అనే సంక్షోభంలో చిక్కుకుంది. మనం జాగ్రత్త పడకపోతే, తెలుగు రాష్ట్రాల్లో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే, ఇప్పుడు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు సమర్థనీయమైనవి. జనాభా అంటే కేవలం సంఖ్య కాదు, అది దేశ ప్రతిభకు, సామర్థ్యానికి నిదర్శనం. యువతరం తగ్గుదల అంటే, రేపటి మేధావుల కొరత ఏర్పడటమే. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలనే మన ఆకాంక్ష నెరవేరాలంటే, మన మానవ వనరుల పునాది పటిష్ఠంగా ఉండాలి. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, పిల్లల పెంపకంలో ఉన్న అనిశ్చితిని తొలగించడం, సమాజంలో పెరిగిన వ్యక్తివాదానికి అతీతంగా కుటుంబ విలువల ప్రాముఖ్యతను గుర్తించడం ద్వారానే మనం ఈ గడ్డు కాలాన్ని దాటగలం. ప్రభుత్వం తనవంతు ప్రయత్నంగా ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇప్పుడు సమాజం, ముఖ్యంగా నేటి యువత, ఈ దేశ భవిష్యత్తు కోసం ఒక సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# మత్స్యకారులకు ఆనందం తెచ్చిన.. ముఖ్యమంత్రి

## • తుమ్మలపెంటకు చంద్రబాబు వరాలు




చెక్కును విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు

సముద్రంలో చేపల వేటతో మనుగడ సాగించే మత్స్యకారులకు వేట విరామ సమయంలో జీవనోపాధి కోసం ఆర్థిక సాయం అందడంతో మత్సకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల్లూరుజిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట గ్రామానికి వచ్చి మత్స్యకారులకు ప్రభుత్వం తరపున 20వేల రూపాయల వంతున అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 కుటుంబాలకు 262 కోట్ల రూపాయల ఆర్థికసాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో వేశారు. ఈ సందర్భంగా ఆయన తుమ్మలపెంటలోని తానం గారి బాబు అనే మత్స్యకారుని ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లారు. మార్కెట్‌కి వెళ్ళి చేపలు కొని వారికి ఇచ్చి, వాటిని వండించారు. స్వయంగా చేపల పులుసు వండుతూ ముఖ్యమంత్రి ఆ కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఆ కుటుంబంతోనే కలసి భోజనం చేశారు. తమ కుటుంబాలతో ముఖ్యమంత్రి సాన్నిహిత్యం చూసి మత్స్యకారులంతా సంతోషించారు. తొలుత, 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ, మత్స్యకారులకు ప్రభుత్వం తరపున ఎంత అండగా ఉంటున్నదీ వివరంగా తెలియజెప్పారు. రూ. 3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోందన్నారు. మత్స్యకారుల రక్షణ కోసం సముద్రంలో 4550 ట్రాన్స్‌పాండర్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను సిద్ధం చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో కావలి ప్రాంతం కనకపట్నం అయ్యేలా అభివృద్ధి జరుగుతోందని, పలు పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. తుమ్మలపెంట ప్రాంతాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.

### గత పాలకులదంతా విధ్వంసమే!

గత వైకాపా పాలకులు విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఇప్పటికీ తమ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తూనే ఉన్నారని, అలాంటివారి మాటలు నమ్మవద్దని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. "రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్యకారులకే అప్పగించాం. రాష్ట్ర వ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్‌ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్యకారులకు అందుబాటులోకి తెస్తాం' అని ఆయన మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. ఈ ప్రాంతంలో 25 మత్స్యకారుల గ్రామాలను కనెక్టు చేస్తూ మెటల్ రోడ్లు వేస్తాం. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్‌కు రూ.6.19 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ కాలువను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ గానూ తీర్చిదిద్దుతాం. ప్రతీ ఇంటిపైనా, పొలంలోనూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం అని చెప్పారు. ఆక్వాకల్చర్ అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మన సముద్రజలాల్లోకి ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### మత్స్యకారుల కుటుంబాలకు అండగా ఉంటాం :

తీరప్రాంతాల్లో మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో సాయంగా ఉంటుందని, వారు సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉదయం 11 గంటల ప్రాంతాల్లో తుమ్మలపెంటకు వచ్చిన ముఖ్యమంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా అభివృద్ధికి, కావలి ప్రగతికి, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా ఇచ్చి సాయంత్రం 5.21 గంటల ప్రాంతంలో అక్కడినుంచి బయలుదేరి వెళ్ళారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపి వేమిరెడ్డి దంపతులు, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ హిమాన్షును అభినందించిన సీఎం




ముఖ్యమంత్రికి పాటూరి షాల్‌ను బహుకరిస్తున్న కలెక్టర్

'మత్స్యకార సేవలో' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. నెల్లూరు జిల్లా పలు విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించిందని, జిల్లాలో ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రజలు అధిక శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లాను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. అంగన్‌వాడీల పనితీరు బాగున్నాయన్నారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సంస్థల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం విషయంలో అధికారులు మెరుగైన పనితీరు కనబరుస్తున్నారని సీఎం ప్రశంసించారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందించడంలో, మధ్యాహ్నభోజనం అమలులో రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం విశేషమన్నారు. స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు కార్యక్రమం అమలు సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. దేవాలయాలకు తాగునీరు అందించే విషయంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే 3 శాతం తక్కువగా ఉందని, ఈ అంశంలో అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు కూడా సంతృప్తికరంగా ఉందని సీఎం పేర్కొన్నారు. పాఠశాల విద్యలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని, దీపం పథకం అమలులో కూడా జిల్లా మెరుగైన ఫలితాలు సాధిస్తోందని తెలిపారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణను మెరుగుపరచాలని ఆయన సూచించారు. తొలుత, హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ హిమాన్షు శుక్ల ముఖ్యమంత్రికి పాటూరు షాల్‌ని బహుకరించారు. పాటూరులో సుమారు 250 మంది చేనేతకుటుంబాలు వారున్నారని, ఎంతో అద్భుతంగా నేతచీరలు, వస్త్రాలు తయారుచేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన సీఎంకి వివరించారు.

### ముస్తాబవుతున్న బాలు స్మారకం

# జూన్ 4న గానగంధర్వుని విగ్రహావిష్కరణ

## • ఆవిష్కరించనున్న వెంకయ్యనాయుడు



భారతీయ సినిమా గాయకులు, గాన గంధర్వులు, పద్మవిభూషణులు అన్నింటినీ మించి మన నెల్లూరీయులు ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యం స్మారకం నెల్లూరు నగరంలో ముస్తాబవుతోంది. నగరంలోని మాగుంట లే అవుట్ సమీపంలో అన్నమయ్య సర్కిల్ ఎదురుగా వున్న ఎన్టీఆర్ పార్కులో ఎస్పీబీ స్మారక నిర్మాణ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. బాలసుబ్రహ్మణ్యం దివంగతులై అయిదున్నర సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పటినుండి ఆయన స్మారకం లేదా విగ్రహం నగరంలో నెలకొల్పలేదన్న అసంతృప్తి సంగీతప్రియులలోనూ, బాలు అభిమానులలోనూ నెలకొంది. ఇప్పుడు ఆ ఆకాంక్ష త్వరలో నెరవేరబోతోంది. బాలు స్మారకంతో పాటు 10అడుగుల కాంస్య విగ్రహన్ని సైతం ఆవిష్కరించడానికి బాలు అభిమానులు సంసిద్ధమవుతున్నారు. భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడి చొరవతో పద్మభూషణ్ డాక్టర్ కే.ఐ.వరప్రసాద్‌రెడ్డి, పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో పాటు మరికొంతమంది బాలు అభిమానుల స్ఫూర్తి, సహకారాలతో జూన్ 4వతేదీ సాయంత్రం ఆ మహాగాయకుని 80వ జయంతి సందర్భంగా ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరగబోతోంది. ముప్పవరపు వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సంగీత పండుగలో బాలు సతీమణి సావిత్రమ్మ, కుమారుడు చరణ్, కుమార్తె పల్లవితో పాటు ఇతర కుటుంబ సభ్యులు, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, సినీ సంగీత, సాహిత్య ప్రముఖులు, పాడుతా తీయగా గాయకులు తదితరులు పాల్గొంటారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా మే18వ తేదీ సోమవారం బాలు విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా నట్టరామేశ్వరంలో ప్రఖ్యాత శిల్పి కరుణాకర్ వుడయార్‌చే ఈ విగ్రహం తయారు చేయబడింది. ఆయన స్వీయపర్యవేక్షణలో కార్యక్రమ నిర్వాహకులు, బాలు అభిమానుల సమక్షంలో ఈ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని కార్యక్రమ ముఖ్య సమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి తెలిపారు.



ఆవిష్కరణకి సిద్ధమవుతున్న బాలు విగ్రహం

# నేత్రపర్వంగా.. జొన్నవాడ బ్రహ్మోత్సవాలు



బెజవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి వచ్చిన సారెను కామాక్షితాయి అమ్మవారికి సమర్పించడానికి తీసుకువెళ్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఈనెల 7 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 17వ తేదీ నాటికి పూర్తయ్యాయి. నిత్యపూజలు సేవలతో అమ్మవారి ఆలయం కళకళలాడింది. ఈ వేడుకల్లో ప్రధానంగా 13న రావణసేవ, 14న వెండి నందిసేవ, 15న రథోత్సవం, 16న కళ్యాణోత్సవం-తెప్పోత్సవాలకు భక్తులు మరింత అధికసంఖ్యలో తరలివచ్చారు. విశేష అలంకారాలు, వాహనసేవలు, విశిష్ట పూజలతో స్వామి-అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు నయనందకరంగా సాగాయి. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లుచేశారు. ఈసారి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో, ఈ నెల 16న జరిగిన కళ్యాణోత్సవంలో విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుండి వచ్చిన సారెను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జొన్నవాడ కామాక్షమ్మ వారికి సమర్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు కూడా అందజేశారు.

# విడవలూరులో విపిఆర్ నేత్ర

### 7273 మందికి కంటి పరీక్షలు

సేవే పరమావదిగా భావించే నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో జరుగుతున్న 'విపిఆర్ నేత్ర' కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు గ్రామంలో అనేకమందికి కంటిపరీక్షలు చేశారు. కంటి చూపు సరిగా కనిపించక ఇబ్బందులు పడే పేదల కోసం విపిఆర్ నేత్ర వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విడవలూరు మండలంలో నెలరోజుల పాటు 22 శిబిరాలు నిర్వహించి, మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 7273 పేదలకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన 4273 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు.



# నెల్లూరు కబుర్లు

## విద్యార్థి చదువుకు
# విపిఆర్ లక్ష సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 19న సంగం మండలం, సిద్ధిపురం గ్రామానికి చెందిన దేగా మనోహర్‌రెడ్డి కుమారుడు చంద్రిల్‌రెడ్డికి ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల (ఆర్ఐఎంసీ)లో 8వ తరగతి పూర్తి చేసుకుని, 9వ తరగతిలోకి అడుగుపెడుతున్న చంద్రిల్ రెడ్డి చదువు కోసం ఎంపీ ఈ ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో తనను కలిసిన విద్యార్థి చంద్రిల్‌రెడ్డిని, వారి కుటుంబసభ్యులను వేమిరెడ్డి అభినందించి, దేశసేవలో భాగమయ్యే మిలిటరీ చదువుల్లో చంద్రిల్‌రెడ్డి మరింతగా రాణించి, నెల్లూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

# సాహిత్యంతో..సాయంత్రం


'నీటికుండలాంటి మనిషి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

ఇటీవల నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహిత్యంతో సాయంత్రం కార్యక్రమం జరిగింది. స్థానిక దర్గామిట్ట శ్రీ వేంకటేశ్వర విద్యాలయం ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అరసం నెల్లూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెరుగు రామకృష్ణ అతిథులుగా పాల్గొని సాహిత్య విషయాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ సుంకర గోపాల్ రెండవ వచన కవితా సంపుటి 'నీటికుండలాంటి మనిషి' పుస్తకాన్ని డాక్టర్ పెరుగు రామకృష్ణ ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు, సభ్యులు రవికుమార్, కుని అంకబాబు, గోవిందరాజు సుభద్రాదేవి, పార్లపల్లి నాగేశ్వరి, మునీంద్ర, కొల్లూరి శ్రీనివాసరావు, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# రంగనాథాలయంలో అన్నదానం

నెల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు. ఈనెల 16 శనివారం రోజున ఆమేరకు అన్నదానం చేపట్టారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ వెంకటరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

# ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ కిట్‌లు
## అందజేసిన ఎస్పీ అజిత


ట్రాఫిక్ పోలీసులకి కూలింగ్ కిట్‌లను అందజేస్తున్న ఎస్పీ అజిత

ఈ మండుటెండల్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అజిత ఇటీవల కూలింగ్ కిట్‌లు అందజేశారు. ఎండలో ఇబ్బంది లేకుండా వారి సంక్షేమం కోసం ఎస్పీ చేస్తున్న సాయానికి పోలీసు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. నగర ఏఎస్పీ దీక్ష, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు రామకృష్ణ, వెంకటరెడ్డి, నగర పోలీసు ఇన్స్‌పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, సోమయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూతో జాగ్రత్త!
## • డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వంగా ఉన్న అది ప్రాణాలమీదికి తెస్తుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత హెచ్చరించారు. డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 16న నెల్లూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద నుంచి సంతపేట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, తీవ్రమైన జ్వరం, ఎముకలు కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలన్నారు. డీఎల్ఏటీఓ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియా అధికారి అంశుధర్, ఎఫ్‌డీసీ వైద్యాధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో హైటెక్ 'మిస్ట్ మిషన్'



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పచ్చదనంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'మిస్ట్ మిషన్' రంగంలోకి దిగింది. నగరంలోని 14వ డివిజన్ ఏసీనగర్ మల్లెల సంజీవయ్య ప్రాంగణంలో ఈ బహుళ ప్రయోజన మిషన్ పనితీరును రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిస్ట్ మిషన్ ద్వారా రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న మొక్కలపైకి అత్యంత వేగంగా నీటి తుంపర్లను విరజిమ్మి, వాటిపై పేరుకుపోయిన దుమ్ము, ధూళిని పూర్తిగా తొలగించవచ్చన్నారు. దీనివల్ల మొక్కలు పచ్చగా, కళకళలాడుతూ ఎదుగుతాయని తెలిపారు. కేవలం మొక్కలకు జీవజలాన్ని అందించడమే కాకుండా, నగర రోడ్లను శుభ్రం చేయడానికి, వేసవిలో గాలిలోని వేడితాపాన్ని తగ్గించి చల్లబరచడానికి ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. వీటన్నింటితో పాటు నగరంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించి నప్పుడు, తక్షణమే నీటిని వెదజల్లి మంటలను అదుపు చేసే ప్రత్యేక అత్యవసర సౌకర్యం కూడా ఈ మిషన్‌లో ఉందన్నారు.

# దర్గామిట్టలో కార్డన్ సర్చ్

నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్ నగర్, క్రాంతినగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటినీ తనిఖీ చేశారు. సుమారు 70 మంది పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 34 మోటార్‌బైక్‌లను, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. పాత కేసుల్లోని నిందితులను, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేసేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దర్గామిట్ట పోలీసు ఇన్స్‌పెక్టర్ కళ్యాణరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# జడ్పీలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర



స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇటీవల జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో, పలువురు జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ అధికారులు సిబ్బందితో కలసి మానవహారంగా ఏర్పడి, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఇందుకూరుపేట, కోవూరు జడ్పీటీసీ సభ్యురాళ్ళు జయలక్ష్మమ్మ, కవరగిరి శ్రీలత, కోట జడ్పీటీసీ సభ్యులు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో కార్మికసంఘాల 'గర్జన'

ఆర్టీసీలో విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించవద్దంటూ ఆర్టీసీ కార్మికసంఘాల వారు నెల్లూరులోని ఆర్టీసీ డిపో గ్యారేజ్ గేటు వద్ద ఈనెల19న ఆందోళన చేశారు. కార్మికసంఘాల వారంతా ఏకమై, ఆర్టీసీ 2వ డిపో పరిరక్షణ కోసం 'గర్జన సభ' ఏర్పాటుచేశారు. ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదన్నారు. సీఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ, ఆర్టీసీ పరిరక్షణకు ఎస్‌డబ్ల్యుఎఫ్ చేపట్టిన నిరసనలు నూరో రోజుకు చేరుకున్నాయని ప్రభుత్వం వారి ఆందోళనలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రజలకు మెరుగైన రవాణాసేవలందించే ఆర్టీసిని కాపాడేందుకు ఉద్యమిస్తామన్నారు. ఈ ఆందోళనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రమ్మణ్యం, సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌కుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుడు నారాయణరెడ్డి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకి సిద్ధం కావాలి!


సభలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఈనెల 19న నెల్లూరులోని కొత్తూరులో ఏఐటియుసి 3వ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని, కార్మికులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని అన్నారు. పెరిగిన పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరలను ఆయన ప్రస్తావిస్తూ, యుద్ధం నెపంతో సామాన్య ప్రజలపై భారం మోపడం సమంచితం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామా అంకయ్య, జిల్లా నాయకులు కొమ్మి నారాయణ, మధు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి
## • సీపీఎం నేతల నివాళి



ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు..ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 19న నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగింది. సీపీఎం నాయకులు, సుందరయ్య అభిమానులు పాల్గొని ఆయన ప్రజా ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా పేదలకు, రైతుకూలీలకు ఆయన అండదండలందించారని, వారి జీవితాల బాగు కోసం ఉద్యమాలు చేపట్టారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ సందర్భంగా నగరంలోని శెట్టిగుంటరోడ్డు, వీవర్స్‌కాలనీ సెంటర్‌లలో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశారు. అనేకమంది స్థానికులు, సీపీఎం కార్యకర్తలు సేవాభావంతో రక్తదానం చేశారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, ఎస్‌కె మస్తాన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 761 కోట్లతో అభివృద్ధి పనులు

## 40 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు మంత్రి నారాయణ భూమిపూజ



నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. కార్పొరేషన్ పరిధి మొత్తంమీద 761 కోట్ల రూపాయల భారీ వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కాగా, 54వ డివిజన్‌లో 350 కిలో లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇటీవల భూమిపూజ చేశారు. అనంతరం 14వ డివిజన్ ఏసీనగర్ మల్లెల సంజీవయ్య స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 14,000 కోట్ల రూపాయలతో అమృత్ పథకం పనులు జరుగుతున్నాయని, రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నెల్లూరులోని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్లతో విఆర్సీకి ధీటుగా మరో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ నిర్మిస్తున్నామని ప్రకటించారు. తనది వ్యాపార దృక్పధం కాదని, పేదరిక నిర్మూలన కేవలం విద్యాభివృద్ధితోనే సాధ్యమని నమ్మి, ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం, పదోతరగతిలో 580 మార్కులు సాధించిన మల్లెల సంజీవయ్య స్కూల్ విద్యార్థినులను మంత్రి నారాయణ అభినందించి సన్మానించారు. డిప్యూటీ మేయర్ కుమార్‌యాదవ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

## ఎంపీ వేమిరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సాదరస్వాగతం పలుకుతున్న వేమిరెడ్డి దంపతులు

తమది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, రాష్ట్రాభివృద్ధికి-ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈనెల 19న నెల్లూరుజిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో ముఖ్యమంత్రి సమక్షంలో నిర్వహించిన మత్స్యకార సేవలో ఆయన మాట్లాడుతూ మత్స్యకార సేవలో పథకాన్ని ప్రారంభించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి తుమ్మలపెంట గ్రామానికి విచ్చేయడం ఈ ప్రాంత మత్స్యకారుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం 10 వేలు మాత్రమే ఇవ్వగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు రూ.20వేలు అందిస్తూ మత్స్యకారులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మంది మత్స్యకారులకు మొత్తం రూ.261.5 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని, ఒక్క మన నెల్లూరుజిల్లాలోనే 11,644 మంది మత్స్యకారులకు రూ. 23.2 కోట్ల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్య కూడా పెరిగినట్లు వివరించారు. ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా కష్టకాలంలో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. తొలుత వేమిరెడ్డి దంపతులు ముఖ్యమంత్రికి సాదర స్వాగతం పలికారు.

### జనగణనకు..

# వివరాలు ఇవ్వాలి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న జనగణనకు ప్రజలు సహకరించి, గృహగణన, జనగణన సర్వేకి వచ్చే అధికారులకు వివరాలు తెలియజేయాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ హిమబిందు చెప్పారు. ఈ సర్వేలో భాగంగా, ఇళ్లపై గుర్తింపు నంబరును వేసేందుకు తప్పనిసరిగా ఇళ్ళ యజమానులు అనుమతించాలని కోరారు.









సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు

బంధుజనప్రియులు, సమతావాది

పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.26 నాటికి

ముప్పైఎనిమిది సంవత్సరాలు నిండుతాయి.

ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...

కుమారులు :

డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి

పూండ్ల వెంకురెడ్డి

మరియు

కుటుంబసభ్యులు

## ప్లాస్టిక్‌ను అరికట్టాలి..

# పర్యావరణాన్ని కాపాడాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు




'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల భవిష్యత్తులో పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. ఇటీవల 'స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా, నెల్లూరు నగరంలోని విఆర్‌సి గ్రౌండ్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని మున్సిపల్ కమిషనర్ నందన్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈనెల థీమ్‌గా 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్'ను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ థీమ్ లక్ష్యంగా చెప్పారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ప్లాస్టిక్ ఒక కారణమవుతోందని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని, ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలు, తయారీ సంస్థలపై నిరంతర దాడులు నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలను సీజ్ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నందన్ మాట్లాడుతూ, ప్లాస్టిక్‌కి బదులు ప్రజలు క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు వాడుకోవాలని సూచించారు. తొలుత విఆర్‌సి గ్రౌండ్ నుంచి గాంధీ బొమ్మ సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# హోటళ్ళలో అధికారుల తనిఖీలు

- నిబంధనలు పాటించనివారిపై కేసులు



హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

నెల్లూరు నగరంలోని హోటళ్ళు, రెస్టారెంట్లలో ఇటీవల ఆహార భద్రత, తూనికలు కొలతలు, పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, గడువు తేదీలు, నిల్వ విధానాలు, వంటశాలల పరిశుభ్రత, త్రాగునీటి సదుపాయాలు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. వినియోగదారులకు అందజేస్తున్న ఆహార పదార్థాలు ఆహార భద్రత మరియు ప్రమాణాల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా పరిశీలించారు. ధ్రువీకరణ లేని కాటాలను గుర్తించి 3 కేసులు నమోదు చేశారు. మనుబోలులోని ఒక దాబాలో ఎక్స్‌పైరీ అయిన టూటీ ఫ్రూటీ బొప్పాయి ముక్కల ప్యాకెట్లను ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించి కేసు పెట్టారు. నెల్లూరు నేషనల్ హైవేలో ఉన్న మరో దాబాలో ఏ విధమైన తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ లేని ఫ్రిజ్‌లో నిల్వఉంచబడిన చేపలు, రొయ్యలు, కంజులు మరియు బేబీ కార్న్ ప్యాకెట్లను గుర్తించి పది కేజీల ప్యాకెట్లను ధ్వంసం చేశారు. వంటశాలలని శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ సదుపాయం సక్రమంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారపదార్థాలు పెట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.వెంకటేశ్వరరావు, ఫుడ్‌సేఫ్టీ అధికారిణి డా. డి.నీరజ, తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ రియాజ్, డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు..ప్రతిభా పురస్కారాలు



వివరాలను వెల్లడిస్తున్న యపా నాయకులు

చదువులో ఉత్తమంగా రాణిస్తున్న యాదవ విద్యార్థులకు బహుమతులిచ్చి ప్రోత్సహిస్తామని యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(యపా) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లురావుయాదవ్ చెప్పారు. ఈనెల 18న నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 480కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ఈనెల 31వ తేదీ ఉదయం గొలగమూడిరోడ్డులోని యాదవభవన్‌లో జరిగే కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలందజేస్తామని, ఈనెల 30వ తేదీలోపు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఇరుకళలమ్మవారికి..

# 7.46 లక్షల రాబడి



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ హుండీలను ఈనెల18న లెక్కించారు. మార్చి 5 నుంచి మే 18వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా అమ్మవారికి 7,46,198 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఛైర్మన్ సురేంద్రయాదవ్, ఇఓ గిరికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

## మూలస్థానేశ్వరునికి

# విశేష పూజలు



శివపార్వతుల ప్రాకారోత్సవం

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి దేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 18న విశేష పూజలు జరిగాయి. పార్వతీపరమేశ్వరులకు ప్రాకారోత్సవంతో పాటు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## జిల్లాకి..

# కొత్త మలేరియా అధికారి

నెల్లూరు జిల్లాకి కొత్త మలేరియా అధికారి వచ్చారు. శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో ఫైలేరియా విభాగంలో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా ఉన్న ఎం.సింహాచలం నెల్లూరుకు ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈ నెల 18న ఆయన నెల్లూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లాని మలేరియా రహితంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, డెంగ్యూ, ఫైలేరియా, మెదడువాపు వ్యాధుల నివారణకు కృషిచేస్తానని ఆయన చెప్పారు.

# పోషకాహారం పంపిణీ

నెల్లూరు నగరంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 18న సుమారు రెండువందల మందికి పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఏడీఎం హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ట్రస్ట్ సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, అందుకు పోషకాహారం పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దొరసానమ్మ, డాక్టర్ రూప, ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకత ఉన్నవారికే.. భవిష్యత్తు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ఇప్పుడు ప్రపంచం ఒక అద్భుతమైన మార్పు దశలో ఉందని ప్రతిఒక్కరూ గుర్తించాలి. మనం ఊహించని వేగంతో సాంకేతికత ముందుకు దూసుకుపోతోందని గమనించాలి. ఒకప్పుడు మనం "ఉద్యోగం" అని అనుకున్నది ఇప్పుడు 'పాత్ర'గా మారుతోంది; 'వృత్తి' అని అనుకున్నది ఇప్పుడు 'ప్రయాణం'గా మారుతోంది. ఈ మార్పు మనకు భయం కలిగించాల్సిన అవసరం లేదు, ఎందుకంటే ప్రతి మార్పు ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది. 'వికాసే జగతః ధర్మః'.. (మార్పు ప్రపంచ ధర్మం) అని మన ప్రాచీనమహర్షులు ఎప్పుడో చెప్పారు. ఈ ధర్మాన్ని అర్థం చేసుకున్నవారే భవిష్యత్తులో నిలబడగలరు. ఇరవై ఏళ్ల క్రితం మనం ఊహించని ఉద్యోగాలు ఈరోజు అత్యంత ప్రాధాన్యంతో నిలుస్తున్నాయి. అదే విధంగా, ఈరోజు మనకు సాధారణంగా కనిపించే అనేక వృత్తులు వచ్చే ఇరవై ఏళ్లలో పూర్తిగా మారిపోవచ్చు. ఈ మార్పు వెనుక ఉన్న శక్తి కేవలం సాంకేతికత కాదు; మనిషి ఆలోచన, మనిషి సృజనాత్మకత, మనిషి అన్వేషణ. ఒకప్పుడు మనం "పని" అని అనుకున్నది ఇప్పుడు "సమస్య పరిష్కారం"గా మారుతోంది. ఒకప్పుడు మనం 'కంపెనీ' కోసం పనిచేసేవాళ్లం; ఇప్పుడు మనం "ప్రపంచం" కోసం పనిచేస్తున్నాం. ఈ మార్పు మన విద్యార్థులకు ఒక గొప్ప సందేశం ఇస్తోంది: 'వృత్తి అనేది మనం ఎంచుకునేది కాదు; మనం నిర్మించేది' అని అర్థం చేసుకోవాలి.

### మన సామర్థ్యాన్ని పెంచేదే..ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

భవిష్యత్తు వృత్తులలో ఒక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే, అవి మనిషి సామర్థ్యాన్ని విస్తరించే దిశగా సాగుతాయి. ఉదాహరణకు, కృత్రిమ మేధస్సు రంగం. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మనిషి పనిని భర్తీ చేయడానికి కాదు; మనిషి సామర్థ్యాన్ని పెంచడానికి వచ్చింది. హైదరాబాద్‌లో చదువుతున్న అన్విత అనే విద్యార్థిని దీనికి మంచి ఉదాహరణ. ఆమెకు గణితం అంటే ఇష్టం, కానీ కంప్యూటర్ సైన్స్‌లో పెద్దగా అనుభవం లేదు. అయినప్పటికీ ఏఐపై ఆసక్తితో చిన్న చిన్న ప్రాజెక్టులు చేస్తూ, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకుంటూ, ఒక పరిశోధనా కేంద్రంలో ఇంటర్న్‌గా చేరింది. రెండు సంవత్సరాల్లో ఆమె ఒక అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో తన పరిశోధనను ప్రదర్శించింది. ఆమె విజయం మార్కుల వల్ల కాదు; ఆసక్తి వల్ల. ఆసక్తి ఉన్న చోటే భవిష్యత్తు పుడుతుంది. అదేవిధంగా, ఆరోగ్య రంగం కూడా నేటికాలంలో శరవేగంగా విస్తరిస్తోంది. జన్యుశాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యక్తిగత వైద్యం..ఇవి మనిషి ఆరోగ్యాన్ని కూడా పూర్తిగా మార్చేస్తున్నాయి. ఒకప్పుడు వైద్యుడు రోగిని చూసి మందు ఇచ్చేవాడు. ఇప్పుడు డేటా, జన్యు విశ్లేషణ, ఏఐ ఆధారంగా వ్యక్తిగత చికిత్సలు అందిస్తున్నారు. ఇది వైద్య రంగాన్ని పూర్తిగా మార్చేస్తోంది. అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థి రోహిత్ దీనికి ఉదాహరణ. ఆ విద్యార్థి బయాలజీ చదువుతున్నప్పటికీ, డేటా సైన్స్ నేర్చుకోవడం ప్రారంభించాడు. ఈ రెండు రంగాల కలయిక బయో–ఇన్ఫర్మాటిక్స్‌లో ఆ విద్యార్థికి ఒక అద్భుతమైన అవకాశం తెచ్చింది. ఇదే భవిష్యత్తు వృత్తుల సత్యం..రెండు రంగాల కలయికే..కొత్త అవకాశాలను తెస్తుందన్నది వాస్తవం.

### అయినా..సృజనాత్మకతను ఏ.ఐ భర్తీ చేయలేదు

పర్యావరణ మార్పులు కూడా భవిష్యత్తు వృత్తులను ప్రభావితం చేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ, సుస్థిరత (సస్టైనబిలిటీ), పర్యావరణ రక్షణ.. ఇవి అత్యంత వేగంగా పెరగబోయే రంగాలు. ప్రపంచం ఇప్పుడు 'ఎలా ఎక్కువగా ఉత్పత్తి చేయాలి?' అని కాదు; 'ఎలా బాధ్యతగా ఉత్పత్తి చేయాలి?' అని ఆలోచిస్తోంది. జపాన్‌లోని ఒక విద్యార్థి ప్రతిరోజూ తన ఇంటి విద్యుత్ వినియోగాన్ని విశ్లేషిస్తూ, చిన్న చిన్న మార్పులతో ఎనర్జీ సేవింగ్ పద్ధతులు రూపొందించాడు. ఆ ప్రాజెక్ట్ ఆ విద్యార్థికి గ్రీన్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగం తెచ్చింది. అయితే, ఏఐ ఎంత పెరిగినా, మానవ సృజనాత్మకతను మాత్రం పూర్తిగా భర్తీ చేయలేదు. కథలు చెప్పడం, డిజైన్ చేయడం, సంగీతం, కళ, వర్చువల్ రియాలిటీ.. ఇవి భవిష్యత్తు ప్రపంచంలో కొత్తరూపం దాల్చుతున్నాయి. అమెరికాలో చదువుతున్న తెలుగు విద్యార్థిని మేఘనా దీనికి మంచి ఉదాహరణ. ఆమెకు కథలు రాయడం అంటే ఇష్టం. ఆ ఆసక్తిని డిజిటల్ మీడియాతో కలిపి, ఇప్పుడు వర్చువల్ రియాలిటీ కథా రూపశిల్పిగా సేవలందిస్తోంది. ఇది కొత్త ప్రపంచం.. కొత్త కళ. టెక్నాలజీ = కొత్తవృత్తి. ఈ మార్పుల మధ్య ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, భవిష్యత్తు వృత్తులు మనం ఊహించిన దానికంటే ఎక్కువ మానవత్వాన్ని కోరుకుంటాయి. సాంకేతికత ఎంత పెరిగినా, మనిషి హృదయం, మనిషి ఆలోచన, మనిషి అనుభూతి..వంటివి అవి భర్తీచేయలేనివి.

### మార్పును అందరూ అర్థం చేసుకోవాలి

తల్లిదండ్రులు, గురువులు, సమాజం..ఇవన్నీ ఈ మార్పును అర్థం చేసుకోవాలి. పిల్లల ఆసక్తిని గుర్తించడం, వారి ప్రశ్నలను ప్రోత్సహించడం, విఫలమవడాన్ని భయపడనివ్వకపోవడం.. పిల్లల భవిష్యత్తును నిర్మించే పునాదులు. ఒకగురువు తన శిష్యునికి చెప్పాడు: 'నువ్వు ఏ వృత్తిని ఎంచుకున్నావో కాదు; నువ్వు ఆ వృత్తిని ఎలా నిర్మించావో ముఖ్యం' అని. ఈ మాటలో భవిష్యత్తు సత్యం దాగి ఉంది. భవిష్యత్తు పుస్తకాలు చదివినవారిది కాదు. సమస్యలు పరిష్కరించగల వారిది. భవిష్యత్తు సృజనాత్మకత ఉన్నవారిది. భవిష్యత్తు నిరంతరం నేర్చుకునే వారిది. వచ్చే ఇరవై ఏళ్ల వృత్తి ప్రపంచం ఒక సవాలు కాదు..ఒక అవకాశంగా నిలుస్తుంది. మన విద్యార్థులు ఆ అవకాశాన్ని అందుకోవాలి. అందుకు మన గురువులు దారిచూపాలి. తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. మన సమాజం మార్పును అంగీకరించాలి. ఎందుకంటే భవిష్యత్తు ఉద్యోగాలు కొత్తవి కావచ్చు, కానీ 'నేర్చుకునే వాడు ఎదుగుతాడు'.. అన్న సత్యమే ఎప్పటికైనా నిలుస్తుంది.



**వచ్చే వారం:** విజ్ఞాన–సాంకేతిక వృత్తుల : సులభంగా అర్థమయ్యే వివరణ.

E-mail: reddyu@gmail.com

# ఈ ఫలితాలు స్ఫూర్తిదాయకం కావాలి

## జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో జడ్పీ విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఉత్తమ ఫతితాలు సాధించిన విద్యార్థులను, నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానో పాధ్యాయులను అభినందిస్తూ ఈనెల 16న జడ్పీలో జరిగిన సన్మాన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు నిలయాలుగా మారుతున్నాయని, మన ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు దేశ స్థాయిలో పోటీ పడగలరని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గతంలో కంటే మిన్నగా ఈ ఏడాది ఉత్తీర్ణత 87.37శాతం సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. 600మార్కులకు 590మార్కులు సాధించిన 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆమె తన ఆశీస్సులు అందజేశారు. అలాగే, 22 జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం కూడా హర్షదాయకమన్నారు. 'విజయదీపిక' స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, అందుకు ప్రత్యేకంగా జిల్లా ప్రజా పరిషత్ సీఇఓకి, అప్పటి డిప్యూటీ సీఇఓకి ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ జయలక్ష్మమ్మ, కోవూరు జడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత కోట జడ్పీటీసీ సభ్యులు కోటయ్య, జడ్పీ అధికారులు పాల్గొన్నారు.

### జడ్పీలో కారుణ్య నియామకాలు

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు ముగ్గురికి జూనియర్ సహాయకులుగా మరియు ఒక్కరికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఇటీవల కారుణ్య నియమాకాలు చేపట్టారు. అందుకు సహకరించిన జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఇఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఇఓ ఎం.వి.విజయ్ కుమార్‌లకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జొన్నవాడ ఆలయానికి..

# 34.80 లక్షల రాబడి



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవార్ల దేవస్థానంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ముగిసిన సందర్భంలో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది మార్చి 25వ తేదీ నుండి మే 17వ తేదీ వరకు.. 54 రోజులకు గాను శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండీల ద్వారా రూ.34,80,108 దాయం లభించింది. కెనడియన్ డాలర్ 1, కువైట్ దినార్స్ 0.5, ఒమెన్ రియాల్ 7, బంగారు వస్తువులు 30 గ్రాములు 500 మిల్లీ గ్రాములు, వెండి వస్తువులు 140 గ్రాములు, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.1,29,600 రాబడి వచ్చింది. బ్రహ్మోత్సవ చీఫ్ ఫెస్టివల్ అధికారి జంజనం శ్రీనివాసరావు, దేవస్థాన ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు తదితరులు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

# జిల్లాకి శుభవార్త!

- త్వరలో 7 ప్రధాన పరిశ్రమలు
- రూ.10వేల కోట్ల పెట్టుబడులు
- 75 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వెల్లడి**

త్వరలోనే జిల్లాకి 7 ప్రధాన పరిశ్రమలు వస్తున్నాయని, 10వేల కోట్ల పెట్టుబడులు, 75వేలకి పైగా ఉద్యోగాలు రానున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుభవార్త తెలిపారు. తుమ్మలపెంట గ్రామంలో జరిగిన మత్స్యకార సేవలో ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 1వ తేది వింజమూరులో ముఖ్యమంత్రి పర్యటన అనంతరం కేవలం 50 రోజులలోనే జిల్లాలో 7 ప్రధాన పరిశ్రమలు రావడం సంతోషకరమని తెలిపారు. ఆ ఏడు ప్రధాన పరిశ్రమల్లో శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, అనంత్ టెక్నాలజీస్, ఆదిత్య ప్రెసిటెక్ లిమిటెడ్, ఆర్‌ఆర్ ఇండస్ట్రీస్, ఫర్నిచర్ పార్క్, అపోలో టైర్స్ లిమిటెడ్, విశాఖ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ఉన్నాయన్నారు. కావలి సమీప ప్రాంతాల్లో భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని, అలాగే ఇండోసోల్ సంస్థ రూ.69 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తుండగా, ఇఫ్కో కిసాన్ సెజ్ రూ.10వేల కోట్ల పెట్టుబడులతో ముందుకు సాగుతోంది. దగదర్తి ఎయిర్‌పోర్ట్‌కి రూ.1,000 కోట్ల పెట్టుబడితో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నిటి ద్వారా జిల్లాలో సుమారు 1 లక్ష 17 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కలెక్టర్ వివరించారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ ప్రాజెక్టుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుమారు 25 వేల ఎకరాల్లో దీని ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు, 10 వేల కుటుంబాలకు నివాస సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక యువత, యానాది గిరిజనులు మరియు ఎస్సీ వర్గాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు.

### జిల్లాలో మత్స్యకారులకు 23.2 కోట్లు

సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.20,000 ఆర్థిక సహాయం వారి జీవనోపాధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మంది మత్స్యకారులకు మొత్తం రూ.261.5 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని ఆయన చెప్పారు. నెల్లూరు జిల్లాలోనే 11,644 మంది మత్స్యకారులకు రూ.23.2 కోట్ల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమన్నారు.

# గూడూరు  డివిజన్

## పేదలకు అందుబాటులో వైద్య సేవలు

### ఎమ్మెల్యే సునీల్



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్

పేదలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యసేవలు అందించేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరులోని పెద్ద మసీదువీధిలో రూ.1.27 కోట్లతో నూతనంగా నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, మార్కెట్ సెంటర్ వద్ద రూ. 2కోట్లతో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఈ నెల 17న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వం వెంటనే పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కూరగాయల మార్కెట్ అన్ని వసతులతో పూర్తి చేశామని, గతంలో ఉన్న వ్యాపారులకి లక్కీడిప్ నిర్వహించి దుకాణాలు కేటాయిస్తామన్నారు. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఇంధన పొదుపులో భాగంగా సైకిల్‌పైనే పట్టణంలోని కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు పాల్గొన్నారు.



గూడూరులోని జిఎస్‌రాయలు కళ్యాణ మండపంలో ఈ నెల 17వ తేదీ పదవ తరగతి పరీక్షల్లో 570 మార్కులపైన సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను సత్కరిస్తున్న గూడూరు వాసవి క్లబ్ సభ్యులు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

## విపత్తు నిర్వహణపై అవగాహన

గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి భద్రత మరియు విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు మరియు సిబ్బంది ప్రాణాలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సివిల్ డిఫెన్స్ అధికారి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రయాణికులు, సిబ్బంది భద్రత కొరకు అన్ని రైల్వేస్టేషన్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి కనుక ప్రయాణీకులు అప్రమత్తంగా ఉండాలని, అలాగే వడదెబ్బ మూలంగా హఠాత్తుగా గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశామని, ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## టిప్పర్లపై జనసేన ఫిర్యాదు



పరిమితికి మించి అధిక లోడుతో తిరుగుతున్న టిప్పర్ లారీల వల్ల గ్రామీణ ఆర్&బి రహదారులు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావ్ ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధికలోడ్లతో వెళ్తున్న టిప్పర్ లారీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం గూడూరు రవాణా శాఖ అధికారి కిషోర్‌కి జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రావ్ మాట్లాడుతూ వెందోడు, భువనగిరిపాలెం ప్రాంతాల్లోని క్వారీలు, క్రషర్‌ల నుంచి కొండాగుంట, వెంకటేశ్వరపల్లి, కాంద్ర, పారిచెర్ల, గాంధీనగర్ మీదుగా.. కుందకూరు, సైదాపురం ప్రాంతాల్లోనీ క్వారీ, క్రషర్లు నుంచి గొల్లపల్లి, కొమ్మనేటూరు, తిప్పవరపాడు, చెన్నూరు గ్రామాల మీదుగా అధిక లోడ్లు, మితిమీరిన వేగంతో టిప్పర్లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక లోడ్ వాహనాల రాకపోకలను నియంత్రించాలని అధికారులను కోరారు. అందుకు స్పందించిన ఆర్టీఓ కిషోర్, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న టిప్పర్‌లపై చర్యలు తీసుకోవాలని బ్రేక్ ఇన్స్‌పెక్టర్లు సునీల్, శాంతిలను ఆదేశించారు.

## పెట్రోల్, డీజల్

# ధరలు తగ్గించాలి

పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలని వైకాపా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణంలో ఈనెల 19న ఆమేరకు ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. వైసీపీ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీ, ఇతర వైసీపీ నాయకులు

# కల్యాణ వైభవం...!



**జయ్‌కృష్ణ - ఇందిర**

నెల్లూరు వాస్తవ్యులు కోడూరు తాండవ వెంకట మురళీధర్‌రెడ్డి - శ్రీమతి కమలల కుమారుడు **జయ్‌కృష్ణ-ఇందిర సునీల్** (స్వర్గీయ ముమ్మారెడ్డి సునీల్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి సాయి చైతన్యల కుమార్తె)ల వివాహం మే 13వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# యుద్ధ విమానాల తయారీకి.. ఏపీ సిద్ధం

## 2028 నాటికి తొలి యుద్ధవిమానం - డాక్టర్ సతీష్‌రెడ్డి



యుద్ధ విమానాల తయారీ కేంద్రం భూమి పూజలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులతో కలిసి పాల్గొన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మెన్ సతీష్‌రెడ్డి

అమెరికా వంటి అగ్రరాజ్యాలకే సాధ్యమైన శత్రు దేశాల అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీతో శక్తి వంతమైన యుద్ధ విమానాల తయారీకి శ్రీకారం చుడుతున్నామని, యుద్ధ విమానాల తయారీకి ఏపీ సిద్ధం కానుందని డీఆర్‌డీఓ మాజీ చైర్మెన్, జాతీయ భద్రతామండలి సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ఏరో డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లతో కలిసి పుట్టపర్తి సత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలం వెంకటాపురం మరియు బి.కొత్తపల్లి గ్రామాల సమీపంలో డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో నిర్మించనున్న యుద్ధ విమానాల తయారీ కేంద్రం భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15,803 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన ప్రతిష్ఠాత్మక ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా 15 వేల నుంచి నుండి 20 వేల మందికి ఉపాధి లభించనుందని, 2028 నాటికి తొలి యుద్ధ విమానం సిద్ధమవుతుందని తెలిపారు. రాయలసీమను ఏరోస్పేస్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ ఏరో స్పేస్ ప్రాజెక్టు ద్వారా 7500 మందికిపైగా ఉపాధి లభించనుందన్నారు. 2028నాటికి తొలి అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ రెడీ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏడాదికి 16 విమానాలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

భారత్ సొంతంగా తయారు చేయబోతున్న ఈ యుద్ధ విమానాలు శత్రువుల రాడార్ సిగ్నల్‌కు దొరకకుండా లక్ష్యాలను ఛేదించగలవని ఆయన చెప్పారు. ఐదవ తరంతో పాటు ఆరవ తరం ఫైటర్ జెట్ ఫీచర్లను కూడా ఇందులో పొందుపరుస్తున్నారన్నారు. దాదాపు 300 ఎకరాల విస్తీర్ణంలో గల యుద్ధ విమానం ప్రాజెక్టు ప్రాంగణంలో అసెంబ్లీ ఫెసిలిటీస్, టెస్టింగ్ సెంటర్లు, రన్‌వేలు, హ్యాంగర్స్ మరియు అత్యాధునిక ప్రయోగశాలలను నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. ఒక్కో యుద్ధ విమానం తయారీ వ్యయం దాదాపు 900 కోట్ల నుండి 1000కోట్ల వరకు ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఏపీ నుంచి ప్రపంచ దేశాలకు ఈ యుద్ధ విమానాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## 27-28 తేదీల్లో వర్చువల్‌గా..

# మంగళగిరిలో 'మహానాడు'

**మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' ఈనెల 27, 28 తేదీల్లో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా వర్చువల్ పద్ధతిలో జరగబోతోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పార్టీ స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు 37 మహానాడులు విజయవంతంగా జరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడుతూ, ఈసారి 'మహానాడు' నెల్లూరు నుండి మంగళగిరికి మారిందన్నారు. మొదట ఈ మహానాడును నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామని, నెల్లూరులో జరిగుంటే దాదాపు 7వేల బస్సులు, వేలాది కార్లు, ట్రక్కులు వచ్చేవని అన్నారు. అయితే, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునివ్వడంతో, ప్రధాని పిలుపును గౌరవిస్తూ, దేశంలో ఇంధన (పెట్రోల్, డీజిల్) కొరతను దృష్టిలో ఉంచుకుని, ఈ నిర్ణయాన్ని ఏపీలోనూ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావించారన్నారు. అందుకే నెల్లూరు కాకుండా మంగళగిరి కేంద్ర కార్యాలయంలో 'వర్చువల్‌గా మహానాడు' నిర్వహించాలని నిర్ణయించారన్నారు. నారా లోకేష్‌బాబు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడు ఇదే కావడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొందని వివరించారు. ఈ వేదికలో సీఎం చంద్రబాబునాయుడు, జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. మండలానికి రెండు క్లస్టర్లు, పెద్ద మండలాల్లో మూడు క్లస్టర్ల చొప్పున విభజించామని, ప్రతి క్లస్టర్‌లో పార్టీ ప్రెసిడెంట్లు, క్లస్టర్ గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు కలిపి దాదాపు 300 మంది ఒకేచోట కూర్చుని మంగళగిరి మహానాడు లైవ్ కార్యక్రమాలను వీక్షిస్తారని ఆయన తెలిపారు. ఈ మహానాడులో మొత్తం 19 తీర్మానాలను ప్రవేశపెట్టబోతున్నామని కూడా ఆయన చెప్పారు.

# ఆగస్టుకల్లా ఫ్లై ఓవర్ల పనులు పూర్తి



ఫ్లై ఓవర్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, పక్కన గిరిధర్‌రెడ్డి

**• ఎంపీ విపిఆర్**

నెల్లూరురూరల్ పరిధిలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరులు పట్టుబట్టి మరీ పనులు చేయిస్తున్నారని, ఆగస్టు నెల పూర్వయ్యేసరికల్లా రెండు ఫ్లైఓవర్ల పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని బుజబుజనెల్లూరు హైవే జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను నేషనల్ హైవే అధికారులు, పోలీస్ అధికారులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఇటీవల ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిల్డ్రన్స్ పార్క్ హైవే జంక్షన్ వద్ద మరొక ఫ్లైఓవర్ బ్రిడ్జి మరియు నాలుగు పక్కలా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, అతిత్వరలో చిల్డ్రన్స్ పార్క్ హైవే జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరగనుందని ఆయన చెప్పారు. ఫ్లైఓవర్లు పూర్తి అయితే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు.

# అపోలోకు అరుదైన ఘనత

## • కీళ్ళమార్పిడికి 800 పైగా రోబోటిక్ సర్జరీలు పూర్తి



వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ మరో మైలురాయిని అధిగమించింది. 800కి పైగా సర్జరీలు విజయవంతంగా పూర్తిచేసి అందరి అభినందనలు అందుకుంటోంది. ఆసుపత్రి ఆర్థోపెడిక్ మరియు రోబోటిక్ సర్జన్స్ డాక్టర్ చీమల వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, ఆర్థోస్కోపీ వైద్యులు మరియు స్పోర్ట్స్ ఇంజూరీ స్పెషలిస్ట్ డాక్టర్ చీమల విక్రమ్‌రెడ్డి ఇటీవల స్థానిక అపోలో ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ విషయం తెలిపారు. అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందుభార్గవిరెడ్డితో కలిసి వారు మాట్లాడుతూ, తమ ఆసుపత్రిలో ఇప్పటివరకూ 800కు పైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్(కీళ్ల మార్పిడి) శస్త్ర చికిత్సలను జయప్రదంగా పూర్తిచేసినట్లు వారు వెల్లడించారు. అంకితభావం కలిగిన వైద్య బృందం యొక్క నిరంతర కృషి, సహకారంతో అతి త్వరలోనే 1000 శస్త్ర చికిత్సల మైలురాయిని చేరుకోబోతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. రోబోటిక్ సర్జరీల ద్వారా రోగులకు సంబంధించి చికిత్సల విషయంలో ఖచ్చితమైన ఫలితాలను సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యంత అధునాతనమైన పూర్తి ఆటోమేటిక్ రోబోటిక్ టెక్నాలజీ పరికరాలు తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా ఈ అత్యాధునిక రోబోటిక్ సర్జరీలు సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా ఫీజులను సవరించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగి త్వరగా కోలుకునే ప్రక్రియలో మా ఆర్థోపెడిక్ విభాగం ఎప్పుడూ తోడుగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

# రక్తదానంపై అపోహలు వద్దు




రక్తదానం చేస్తున్న దాసరి

రక్తదానమంటే ప్రాణ దానమని, యువత సరైన రీతిలో దీనిని అర్థం చేసుకుని రక్తదానానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ తాత్కాలిక కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ కోరారు. ఈనెల 20న నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రాజేంద్రప్రసాద్‌తో పాటు పలువురు దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు, రోడ్డుప్రమాద బాధితులకు అవసరమైనవారికి రక్తదానం చేయడం ఒక మానవీయ సేవ అన్నారు. గర్భిణులకు శస్త్రచికిత్స సమయంలో రక్తదానం అవసరమని, రక్తం దానం చేయడం ద్వారా వారి నిండుప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. రెడ్‌క్రాస్ తాత్కాలిక మేనేజ్‌మెంట్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, బ్లడ్‌బ్యాంక్ కోఆర్డినేటర్ బయ్యా ప్రసాద్, మెడికల్ అధికారి డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# లేహ్ నగరంలో రాజ్యసభ సభ్యులు బీఎంఆర్



రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఇండస్ట్రీ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ (బీఎంఆర్) ఇటీవల లేహ్ నగరానికి వెళ్ళారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఇండస్ట్రీ అధ్యయన పర్యటనలో భాగంగా లడాఖ్‌లోని లేహ్‌కు చేరుకున్న బీఎంఆర్, కమిటీ సభ్యులతో కలిసి వివిధ అధికారిక సమావేశాలు మరియు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ అధ్యయన పర్యటనలో భాగంగా యుటి ఆఫ్ లడాఖ్ చీఫ్ సెక్రటరీ, ఎంఎస్ఎంఇ సంఘాల ప్రతినిధులు, బ్యాంకింగ్ సంస్థల అధికారులు, ఎస్ఐడీబీఐ మరియు కేంద్ర మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఆర్‌కి లేహ్‌లో సాదర స్వాగతం లభించింది.

## ముగిసిన 'కోరా' శకం - విద్యార్థి లోకంలో శోకం

# ఫిజిక్సు గురువు కోరా సారు ఇక లేరు



ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలో సైతం 1985-1999 అంటే 14 సంవత్సరాల పాటు ఒక సంచలనంగా వెలుగొందిన కోరా విద్యా సంస్థల వ్యవస్థాపక డైరెక్టర్, కోరా సార్‌గా ప్రఖ్యాతి చెందిన కొండవీటి కోదండరామయ్య (కోరా) మే 17వ తేదీ తన 87వ యేట తెలంగాణలోని వికారాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. తన సహచర అధ్యాపకులు రాజగోపాలరెడ్డి, నరసింహులు, రామకృష్ణారెడ్డి, వినయ్‌బాబులతో కలిసి 1985లో నెల్లూరులో కోరా విద్యాసంస్థని కోదండరామయ్య స్థాపించారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దకాలం పాటు అప్రతిహతంగా ఎదిగి దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థగా కోరా ప్రకాశించింది. కొన్ని వేలమంది డాక్టర్లనీ, ఇంజనీర్లని సమాజానికి అందించింది. ఆ తరువాతి కాలంలో సంస్థలో చోటుచేసుకున్న కొన్ని దురదృష్టకర సంఘటనల కారణంగా 1999లో కోరా సంస్థ మూతపడింది. నరసింహులుతో సహా వినయ్‌బాబు, రామకృష్ణారెడ్డి, రాజగోపాలరెడ్డి ఒక్కొక్కరుగా కాలం చేశారు. చివరిగా కోరా సార్ కన్నుమూయడంతో కోరా శకం ముగిసి విద్యార్థిలోకానికి శోకం మిగిల్చింది. కోరా కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## నెల్‌క్యాస్ట్, రోటరీ వెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం





ఓజిలి మండలం, పెదపరియలో వున్న నెల్‌క్యాస్ట్ లిమిటెడ్‌లో నెల్‌క్యాస్, రోటరీ క్లబ్ వెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. సుమారు 200 మంది నెల్‌క్యాస్ట్ ఉద్యోగులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన మందులను నెల్‌క్యాస్ట్ యాజమాన్యం ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (కార్పొరేట్) ఎన్.ఎస్.రెడ్డి, రోటరీ వెస్ట్ అధ్యక్షులు డి.విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నెల్‌క్యాస్ట్ ఉద్యోగులకు నెల్లూరులోని బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి(కిమ్స్) వారిచే ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ వైద్యులు ఎం.వి. రాఘవేంద్ర, ఎం.అవినాష్‌రావు, బి.వి.సాయిభరత్, ఎ.సానిష్‌రెడ్డి, షేక్ అన్వూ, మాధురి, ఈశ్వర్ అగర్వాల్ పాల్గొన్నగా పీఆర్ఓ నవీన్ జయకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రోటరీ కార్యదర్శి రాఘవరెడ్డి, నెల్‌క్యాస్ట్ పెదపరియ ప్లాంట్ హెడ్ టి.విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ కంపెనీ పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, హెచ్ఆర్ ఉద్యోగులు ఎ.సునైరాజ్, ఎమ్.మల్లిఖార్జున, సిహెచ్ నవీన్, రొటేరియన్లు నాశిన నాగులు, దువ్వూరు రవీంద్రనాథ్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా గృహగణన

నెల్లూరు నగరంలో గృహగణన-జనగణన సర్వే వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 20వతేదీ సాయంత్రానికి 1,66,561 గృహాలను సర్వే చేసినట్లు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ గృహాల్లో మొత్తం 6,90,005 మంది నివాసం ఉన్నట్లు గుర్తించారు. 1300 మంది సిబ్బంది ఈ సర్వే చేస్తున్నారు. 33 ప్రశ్నలతో కూడిన ఈ సర్వేని ఇళ్ల యజమానులకు తెలిపి, సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈనెల 30వ తేదీకల్లా జనగణన ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది కనుక, సర్వేసిబ్బంది మరింత చురుగ్గా వ్యవహరిస్తున్నారు.

# కవితల పూదోటలో విరిసిన.. 'వెలుగుపూల వసంతం'

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, కళారత్న చిన్ని నారాయణరావు కవనవనం నుండి మరొక వికసించిన పుష్పమొకటి "వెలుగుపూల వసంతం" కవితా సంపుటి రూపంలో పరిమళించింది. చిన్ని నారాయణ రావు చేయి తిరిగిన కవి. ఇంతకుముందు బతుకొక ఉత్సవం, గంపకూడు, అంతర్ముఖం, జీవితం ఓ విజయంలాంటి కవితా సంపుటాలు "దాహం.. దాహం", మాట లాంటి దీర్ఘకవితా సంపుటాలు కవనలోకానికి పరిచయం చేశారు. తన మాట దీర్ఘకావ్యం ఇంగ్లీషులో "ది వర్డ్"గా అనువదించబడి అందరిచే ప్రశంసింపబడింది. ఇప్పుడు ఈ "వెలుగుపూల వసంతం" అనే మరొక కవితల సంపుటిని విడుదల చేసి, కవితా దాహార్తిని తీర్చుకోమని మనముందు ఉంచారు. దీనిలో అనేక కవితలు హృదయాన్ని తడిచేసే బాధ్యతను తీసుకుంటాయి.

"రేపటి వసంతం" అనే కవితలో రోడ్డు ప్రమాదాల గురించి బాధపడుతూ "రోడ్డు తలకు గాయమై విలపిస్తుందంటూ పర్సనిఫికేషన్ ప్రయోగం చేస్తారు. 'రోడ్లకు ఏమి తెలుసు..పాపం గాయాలను మోస్తూ విషాద గీతికల్ని ఆలపిస్తూ రక్తమోడుతున్నాయి" అంటారు. "ఓటు భరోసా" కవితలో "పొలం దారుల్లో విత్తనాలు చల్లడం లాంటిదే ఓటు వేయడం అంటే.." అంటూ ఒక విస్తృతమైన అర్థాన్ని ఇచ్చే వాక్యాన్ని రాశారు. అదే కవితలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి అన్న అర్థంతో "మొక్కలకు ప్రాణవాయువులు అందించి ఫలాల ఫలితాన్ని పొందినట్లు, ప్రజాస్వామ్యానికి ఓటు ఆక్సిజన్ ఇచ్చి బ్రతికించుకోవాలి' అని సిమిలీని ప్రయోగిస్తారు.

ఇటీవల కాలంలో ఆశ చూపించి మోసం చేయడం.. సైబర్ నేరాలు .. ఇలా అనేకం ప్రజల్ని ఇబ్బందిపాలు చేస్తున్న సందర్భంగా తన గెలుపు కవితలో "మన బలహీనమైన క్షణంలో కదా వాడు బలమైన సంకెళ్ల వేసేది. మన బలహీనత బ్యాలెన్స్ తప్పిన తీగపై మనిషిలా వ్రేలాడితే అది వాడికి ఆయుధంగా మిగులుతుందని" బలహీనతలపై హెచ్చరికలు చేస్తారు. ప్రశాంతంగా ఉండే నెల్లూరు ఈ మధ్యకాలంలో అశాంతికి మూలం అవడాన్ని భరించలేని చిన్ని నారాయణరావు ఆవేదనతో... "సొకుమార్యం నుదుట కత్తి గాయం గాటు కన్పిస్తుందంటూ... కపోతాలు ఎగరాలి" అన్న కవిత రాశారు.

"ఆరో ప్రాణం" అనే కవితలో ఇంటి గురించి రాస్తూ "ఆ తలుపును ముట్టుకుంటే తనువును ముట్టుకున్నట్లే.. ఆ గోడను తాకితే గుండెను తాకినట్లే అంటూ మనసుకు హత్తుకునే వాక్యాలు రాస్తారు.

కవితల్లో సెటైరికల్ కవితలు కూడా ఉంటాయి. ఈ విషయాన్ని మనం కవి రాసిన "నోట్ల సంద్రంలో.." అన్న శీర్షిక కింద రాసిన పంక్తులు గమనిస్తే తెలుస్తుంది. "పచ్చ నోట్లు రెపరెపమంటే.. కళ్ళకు లైట్లు పేర్చినట్లు వెలిగిపోతాయి.. జేబులో నిండా దాక్కుని ఉన్నా.. మరిన్ని ఆ నోట్ల ధగధగలకు మనసు కపోతమై ఆకాశమార్గాన పయనిస్తుంది"... అంటారు.



రచయిత:
**చిన్ని నారాయణరావు**
వెల: రూ. 170/- పేజీలు: 140
ప్రతులకు: చిన్ని నారాయణరావు
27-1-171, శ్రీనికేతనమ్
ఆదిత్యనగర్, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు,
నెల్లూరు-2. సెల్: 94402 02942

అలాగే ఈ కవితా సంపుటిలో వస్తు వైవిధ్యం ఉంది. ఎవరు ఇంతవరకు ఎంచుకోని కొన్ని వస్తువులను చిన్ని నారాయణరావు ఎంచుకొని కవితలు రాశారు.

డయాబెటిస్ ఉన్నవారు తినగలిగే ఒకే ఒక పండు జామకాయ. డయాబెటిస్ ఉన్నవారు జామకాయని ఏ విధంగా ఇష్టపడతారో కవిత్వంలో మనకు అందించారు. అదేవిధంగా గుత్తేదారు గురించి కూడా కవిత రాశారు.

ఈ కవితా సంపుటిలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మూలమైన శ్రీ పొట్టి శ్రీరాములు గురించి.. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురించి.. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి.. 'ఈనాడు' రామోజీరావు గురించి.. శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు వరప్రసాద్‌రెడ్డి గురించి.. నెల్లూరు కవితాభిమ్ముడు స్వర్గీయ మెట్టు రామచంద్ర ప్రసాద్ గురించి ఇలా... అనేకమంది మహనీయ వ్యక్తుల గురించి కూడా కవితలు రాశారు.

చిన్ని నారాయణ రావు కవితల్లో ఒక మోటివేషన్ ఉంటుంది. ఒక పాజిటివిటీ ఉంటుంది. ద్వేషం గూడు కట్టుకున్న గుండెల్లో ప్రేమ చిగురింప జేయాలని కవి ఆశయం. యువతకు మంచి మార్గం చూపాలనే కవి ఆశయం. అందుకే "నేను కవితా తుఫాన్లను సృష్టిస్తుంటాను. మానవీయ పదవల తెరచాపలెత్తి కొత్త హృదయాలతో వెలుతురు స్నానం చేస్తాను" అని ప్రకటించుకున్న చిన్ని నారాయణరావుకి అభినందనలు.



సమీక్ష:
**అవ్వారు శ్రీధర్‌బాబు**
సెల్: 85001 30770

## టూకీగా...



### బుచ్చిలో సుందరయ్య వర్ధంతి

ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, దేశంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి కృషిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయంలో ఈనెల 19న జరిగింది. పార్టీకోసం, పేదప్రజల కోసం ఉద్యమాలకు ఊపిరి పోసిన సుందరయ్య సేవలను స్మరించుకుంటూ సీపీఎం నేతలు జొన్నలగడ్డ వెంకమరాజు తదితరులు నివాళులర్పించారు.

### కేశవరంలో ప్రగతి పనులపై సమీక్ష

కోట మండలంలోని కేశవరం పంచాయతీలో ఈనెల19న ప్రత్యేక అధికారి కటారి జయజయరావు ఆధ్వర్యంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరిగింది. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు కృషిచేయాలని ఆయన సూచించారు. మంచినీటి సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ దిలీప్‌నాయక్ పాల్గొన్నారు.

### వెంగారెడ్డిపాళెంలో..'బడి పిలుస్తోంది'

సంగం మండలం వెంగారెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలలో ఈనెల 19న 'బడి పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ర్యాలీ నిర్వహించి అక్షరాస్యత పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### వింజమూరులో 50 శాతం రాయితీతో పశు దాణా

వింజమూరు మండల రైతులకు 50 శాతం రాయితీతో పశు దాణా అందజేస్తున్నామని, రైతులు పశు సహాయకుల సమక్షంలో వాటిని తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని వింజమూరు పశు వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు కోరారు.

### దువ్వూరు కాలువకు సాగునీటి విడుదల

సంగం మండలంలోని దువ్వూరు కాలువ, డీబీ చానల్ కాలువలకు మంత్రి ఆనం ఆదేశాల మేరకు ఈనెల 18న నీటిపారుదల ఏఇ వినయకుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డిలు సాగునీటిని విడుదల చేశారు.

# అనురాగ రాగరంజితం..
# నా జీవన 'వసంత'ం!




## అర్ధాంగికి అక్షరాభిషేకం చేసిన వరప్రసాద్‌రెడ్డి

అసలే ఆమె పేరు 'వసంత'ం. ఆమె మనసంతా ఆగని ఆమనిగానం. రుతువుల్లో రాణి.. నా జీవిత చుక్కాని. నా జన్మకో అర్ధాన్ని-పరమార్ధాన్ని ఇచ్చిన అర్ధాంగి. ఆలయాన వెలసిన ఆ దేవుని రీతిగా నా మనో మందిరంలో వెలసిన అనురాగదేవత. ఈ తరుణంలో ఆ తరుణికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలను?.. అంటూ ఆలోచించి, అనురాగ రాగ రంజితమైన తన ధర్మపత్నికి, తన జీవన నవ 'వసంతా'నికి.. పూదోటలన్నీ వెతికి వెతికి.. సుగంధభరిత అక్షరసుమాలన్నిటినీ దోసిళ్ళతో తెచ్చి.. తన మనసునే దారంగా చేసి తన ప్రియసతి మెడలో అక్షరహారంగా సమర్పించారు. ఆయనెవరో కాదు.. అక్షరభూషణుడు.. మన పద్మ భూషణుడు డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాదరెడ్డి. ఆయన హృదయ పద్మపీఠంపై చిరునవ్వులతో ఆసీనురాలై ఉండే ఆ దేవతా వసంతం మరెవరో కాదు.. ఆయన అర్ధాంగి.. 'వసంత'. అందుకే ఆయన తన సతీమణి 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని 'ధర్మపత్నీ సమేతస్య'.. అంటూ పుస్తకాన్ని వెలువరించారు. 'వసంత'రాగంగా దాన్ని ఆవిష్కరింపజేయడమే కాక, తన మనోగీతాన్ని 'వందనాలు సిరిచందనాలు.. శత వసంత మధు బంధనాలు' అంటూ పాటగా కూడా రూపొందించారు. మే 15, 16తేదీల్లో హైదరాబాదులోని తమ నివాసం 'శాంత వసంత'లో వరప్రసాదరెడ్డి, ఆయన కుమార్తెలు సంగీత - స్రవంతి, మనవలు శృతి - సంజన - శ్రీవర్ - శ్రితలు నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి తదితర ప్రముఖులంతా హాజరయ్యారు.

### అట్టహాసంగా వసంతమ్మ 75వ పుట్టినరోజు వేడుక :

ఎక్కడో నెల్లూరుజిల్లాలోని ఓ కుగ్రామంలో తాను పుట్టి, మేనత్తకూతురైన వసంతను తన జీవన వసంతంగా చేసుకుని జీవనయానం సాగించిన వరప్రసాదరెడ్డి, తన సతీమణి వసంత 75వ పుట్టిన రోజును ఒక వసంతోత్సవంలా నిర్వహించారు. 15న వసంతమ్మ బంధుమిత్రులు వచ్చి ఆమెని ఆశీర్వదించగా, 16న వెంకయ్యనాయుడు, చిరంజీవి, అనేక మంది రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు, సాహితీ దిగ్గజాలు ఈ వేడుకకు తరలివచ్చారు.

జీవితమంటే.. సుఖాలు-అనురాగాలే కాదు, చెప్పలేనన్ని కష్టాలు, చెప్పుకోలేనన్ని బాధలు కూడా ఉంటాయి. మానని గాయాలూ-కడివెడు కన్నీళ్లూ ఉంటాయి. సన్మానాలే కాదు.. అవమానాలూ ఉంటాయి. జీవితమంటే సుఖాల పందిరే కాదు..చీకటి వెలుగుల మిశ్రమం.. జీవితం. అయితే, అన్ని విషాలకీ విరుగుడు కషాయం.. జీవన సహచరి ఒక్కతే. భార్యే.. దివ్యౌషధం భర్తకి. సతియే పతికి బాసట అన్నట్లుగా, వరప్రసాద్‌రెడ్డి ఈ కార్యక్రమం ద్వారా తన ధర్మపత్నికి మరింత గౌరవాన్ని చేకూర్చారు.

**'నాస్తి భార్యా సమో బంధు: నాస్తి భార్యా సమో గతి: నాస్తి భార్యా, సమో లోకే సహాయో ధర్మ సంగ్రహే'..** అన్నారు పెద్దలు. భార్యవంటి బంధువు లేదు, భార్య కన్నా వేరు మార్గం లేదు. ధర్మాచరణానికి లోకంలో భార్యకు సమానమైనవారు ఎవరూ లేరనేది ఆ శ్లోకం భావం. నాటి మన ప్రాచీన మహార్షుల మాటకు..భారతీయ సంప్రదాయాలకి వారు అక్షర రూపాలు. వారే మన వసంతా-వరప్రసాదులు. వసంతమ్మ పుట్టిన రోజు శుభసందర్భంగా, వారిరువురూ చిరకాలం..చిరయశస్సుతో నిండు నూరేళ్లు పరిపూర్ణ జీవితాలను సాగించాలని మనసారా కోరుకుంటోంది..'లాయర్'!...


'వసంత' రాగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముప్పవరపు వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు

### జీవితాంతం తోడునీడగా నిలిచేది అర్ధాంగే - వెంకయ్యనాయుడు

జీవితంలో సహధర్మచారిణిగా మన కష్టాల్లో, నష్టాల్లో, ఆటుపోట్లలో, సుఖాల్లో అన్ని విషయాల్లోనూ తోడునీడగా నిలిచేది శ్రీమతేనని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. తన సతీమణిని గౌరవిస్తూ వరప్రసాదరెడ్డి వెలువరించిన 'ధర్మపత్నీ సమేతస్య' అనే పుస్తకాన్ని ఈనెల 16న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'వరప్రసాద్‌రెడ్డి ఇలాంటి ఒక మంచి సంప్రదాయాన్ని అనుసరిస్తుండడం హర్షదాయకమన్నారు. సంగీతం, సాహిత్యం, భారతీయ కళల పట్ల వరప్రసాదరెడ్డికి ఎంతో ప్రేమ, ఆదరణ, అభిమానం ఉన్నాయని, తాను సంపాదించినదాంట్లో కొంత ఆ మంచిపనులకు ఖర్చుపెడుతూ ఉంటాడని ఆయన తెలిపారు. మరచిపోతున్న మన సంప్రదాయాలను మరలా గుర్తుకు తెచ్చేవిధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వరప్రసాద్‌రెడ్డిని వెంకయ్యనాయుడు మెచ్చుకున్నారు.

### భార్య పట్ల భర్తకు కృతజ్ఞత ఉండాలి - వరప్రసాద్‌రెడ్డి

మా వసంతమ్మ 75 సంవత్సరాల జన్మదినాన్ని మరో అర్ధవంతమైన సందర్భంగా సమాలోచించుకుని, మీ అందరితో పాటు జన్మదినోత్సవ వేడుకలు జరుపుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు వరప్రసాద్‌రెడ్డి. ఇది బర్త్‌డే పార్టీ అని తేలిగ్గా తీసుకోవద్దని, ఇందులో ఒక కొత్త ఆలోచనలకు ఆవిష్కరణ ఉందని, మనందరం విస్మరించిన ఒక కనీస బాధ్యతను గుర్తుచేసుకునే అంశమని వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. 'అన్నం తినేటప్పుడయినా చేనుకు దండం పెట్టాలి. ఆ చేనును పండించిన రైతుకు దండం పెట్టాలి. దాహం తీర్చుకునేటప్పుడైనా నదిని గుర్తుపెట్టుకోవాలి. దండం పెట్టాలి. మన సంతానాన్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకునేటప్పుడైనా జీవితభాగస్వామిని గుర్తుపెట్టుకుని, కృతజ్ఞతతో నమస్కారం చేయాలి. జీవితంలో ప్రధాన భాగం కృతజ్ఞతే'నన్నారు వరప్రసాద్‌రెడ్డి. కుటుంబానికి తన సతీమణి చేసిన సేవలకు, శ్రమదానానికి, త్యాగానికి కృతజ్ఞతలు అంటూ, ఈ సందర్భంగా తన శ్రీమతి వసంతమ్మకి ఆయన కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

### వరప్రసాద్‌రెడ్డి సేవలు మార్గదర్శకం - మెగాస్టార్ చిరంజీవి

వరప్రసాద్‌రెడ్డి తనకు చిరకాలమిత్రులని, అమ్మని 'మాతృదేవో భవ' అంటూ చక్కని కార్యక్రమాలు నిర్వహించడమే కాక, తన సతీమణిని ఇంతగా గౌరవించడం చూస్తే, మహిళలకు ఆయనెంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్ధమవుతోందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. వరప్రసాద్ పేరు వినగానే తనకు శంకరవరప్రసాద్ సినిమా గుర్తుకొస్తుందని ఆయన అంటూ, కట్టుకున్న భార్యని చులకనగా చూస్తున్న నేటి సమాజంలో, తనకి జన్మనిచ్చిన తల్లిని, జీవితాన్ని పంచుకున్న వసంతమ్మని వరప్రసాదరెడ్డి ఎంతో ప్రేమగా చూస్తుండడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మార్గదర్శకమని కొనియాడారు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com